www.visalaandhra.com

శనివారం
01-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 10
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

నాహల్‌కు న్యాయం జరగాలి

ఫ్రాన్స్ దేశం అట్టుడికిపోతోంది. పోలీసుల కాల్పుల్లో 17ఏళ్ల నాహల్ మరణించడంతో దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. గత మూడు రోజులుగా ప్రధాన నగరాల్లో నిరసనలు హోరెత్తగా, కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి.

2 లో

పెల్లుబికిన ప్రజాగ్రహం

విశాఖపట్నంలో...

గుంటూరులో...

విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లపై వామపక్షాల ఆందోళనలు

కేంద్ర సంస్కరణలు అడ్డుకోలేని అసమర్థుడు జగన్: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల్లో భాగంగా రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై వేస్తున్న భారాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. పది వామపక్ష పార్టీల పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా, పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొని నిరసన తెలియజేశారు. విశాఖపట్నం సీతమ్మధార ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ (ఎన్‌డీ) తదితర వామపక్ష పార్టీల అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని ఎవరైనా ప్రభుత్వాన్ని అడిగారా? కనీసం వైసీపీ ఎమ్మెల్యేలు అయినా అడిగారా? అని ప్రశ్నించారు. ఎవరికీ ఉపయోగం లేని స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని నిలదీశారు. విద్యుత్ సర్ చార్జీల పేరుతో గజదొంగలా జగన్ దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా బాదుడే బాదుడు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించిన జగన్... అధికారం చేపట్టాక అనేకసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్యుత్ చార్జీల బాదుడుకు

- మిగతా 2 లో

ఏలూరులో...



చంద్రబాబు నివాస భవనం జప్తుకు

అనుమతి

- తొలుత భవన యజమాని లింగమనేనికి నోటీసు ఇవ్వాలి
- సీఐడీ అధికారులకు ఏసీబీ కోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి కరకట్ట సమీపంలో నివాసముంటున్న లింగమనేని రమేశ్ గెస్ట్‌హౌస్ జప్తుపై ఏసీబీ కోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. సీఐడీ వేసిన పిటిషన్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతించింది. అయితే లింగమనేని రమేశ్‌కు ముందుగా నోటీసు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. లింగమనేని రమేశ్ గెస్ట్‌హౌస్‌ను అటాచ్ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో ఇచ్చింది. దీంతో గెస్ట్‌హౌస్ జప్తునకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఉభయ పక్షాల వాదనలు విన్న ధర్మాసనం పై మేరకు తుది తీర్పు వెలువరించింది.

రుణభారత్

624.7 బిలియన్ డాలర్లకు విదేశీ అప్పు

ముంబై: మన దేశం రుణభారతంగా మారిపోగా అప్పులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రుణ-జీడీపీ తగ్గినప్పటికీ 2023 మార్చి ముగిసేనాటికి వార్షిక విదేశీ రుణం 624.7 బిలియన్ డాలర్లుగా ఉందని భారత రిజర్వు బ్యాంకు శుక్రవారం ఓ నివేదిక విడుదల చేసింది. 2022 మార్చి చివరికి 619.1 బిలియన్ డాలర్లుగా ఉన్న రుణం మరో 5.6 బిలియన్ డాలర్లు పెరిగినట్లు అందులో తెలిపింది. 2023 మార్చి చివరికి విదేశీ రుణం-జీడీపీ నిష్పత్తి 18.9శాతానికి తగ్గిందని, అంతకుముందు ఏడాది 20శాతంగా ఉందని ఆర్బీఐ వెల్లడించింది. మూల్యాంకనం ప్రభావాన్ని మినహాయిస్తే విదేశీ రుణం 2023 మార్చి చివరికల్లా 5.6 బిలియన్ డాలర్లకు బదులు 26.2 బిలియన్ డాలర్లకు పెరిగి ఉండేదని తెలిపింది. దీర్ఘకాలిక రుణం (ఏడాదికిపైగా మెచూరిటీ కాలం ఉన్నవి) 496.3 బిలియన్ డాలర్లుగా ఉంటే 2022 మార్చి చివరికి ఉన్న మొత్తంతో

- మిగతా 2 లో

వీసీల భర్తీలో రాజకీయం వీడేనా?

ఏడు విశ్వవిద్యాలయాలకు నియామకాలు

ఉన్నత విద్యామండలి ప్రకటన జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉప కులపతులు(వీసీ) నియామకం ఈ సారైనా సక్రంగా జరిగేనా?, లేక ప్రభుత్వానికి వత్తాసు పలికే వారినే నియమిస్తారా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఏడు విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ప్రకటన జారీజేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, ద్రావిడ విశ్వవిద్యాలయం, రాయలసీమ విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ-అనంతపురం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయాల వీసీల నియామకానికి ప్రకటన వెలువడింది. ప్రస్తుతమున్న వారి పదవీ కాలం ముగియడంతో

- మిగతా 2 లో



నాహల్‌కు న్యాయం జరగాలి

- టీనేజర్‌ను కాల్చి చంపిన పోలీసు
- ఫ్రాన్స్‌వ్యాప్తంగా నిరసనలు, హింస
- హంతక పోలీసుపై చర్యలకు, మంత్రి గెరాల్డ్ రాజీనామాకు డిమాండ్
- 660 మంది అరెస్టు - 250 మంది పోలీసులకు గాయాలు

పారిస్: ఫ్రాన్స్ దేశం అట్టుడికిపోతోంది. పోలీసుల కాల్పుల్లో 17ఏళ్ల నాహల్ మరణించడంతో దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. గత మూడు రోజులుగా ప్రధాన నగరాల్లో నిరసనలు హోరెత్తగా, కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. అనేక వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. నాహెల్ ట్రాఫిక్ చెక్‌ను అధిగమించడంతో కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ ఘటన మంగళవారం జరిగింది. సంబంధిత దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. ట్రాఫిక్‌చెక్‌ను అధిగమించినంత మాత్రాన కాల్చి చంపేందుకు పోలీసులకు హక్కు ఎవరిచ్చారని నిరసనకారులు నిలదీశారు. హంతక పోలీసులపై చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ అంతర్గత శాఖ మంత్రి గెరాల్డ్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫ్రాన్స్‌లో జాతి వివక్ష ఉందని, బహుళజాతి సమాజాలపై దాడులకు తాజా ఘటన నిదర్శనమని ఆరోపించారు. ఫ్రాన్స్‌వ్యాప్తంగా అనేక నగరాల్లో వాహనాలకు నిరసనకారులు నిప్పంటించారు. కొన్ని భవనాలను ధ్వంసం చేశారు. లిల్లే ప్రాంతంలోని ఓ ప్రాథమిక పాఠశాలకు నిప్పంటించారు. న్యాయం కోసం డిమాండ్ చేశారు. పోలీసులతోనూ వాగ్వాదం, ఘర్షణలకు దిగిన ఫలితంగా వివిధ ఘటనల్లో 250మంది పోలీసులు గాయపడ్డారు. ఇప్పటివరకు 660 మందికిపైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రి గెరాల్డ్ దర్మానిన్ శుక్రవారం తెలిపారు. 667 మంది అరెస్టు అయినట్లు వెల్లడించారు. ఇదిలావుంటే, నాహల్ తల్లి నేతృత్వంలో 'పోలీస్ కిల్స్' (పోలీసులు చంపేస్తారు', 'కిల్లర్ పోలీస్' (పోలీసులు హంతకులు) బ్యానర్లతో నిరసన ప్రదర్శన పెద్దఎత్తున జరిగింది. నాహల్‌కు న్యాయం కోసం డిమాండ్ మిన్నంటింది. ఈ నిరసనకు మద్దతు పెరుగుతోంది. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలతో ఆ ప్రాంతాన్ని నిరసనకారులు హోరెత్తించారు. మంత్రి గెరాల్డ్ దర్మానిన్ రాజీనామాను డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువును ప్రయోగించారు. శాంతియుతంగా ప్రారంభమైన మార్చ్ మధ్యలో హింసాత్మకంగా మారిందని అంతర్గత మంత్రిత్వశాఖ ప్రతినిధి కామిల్లె చైజ్ తెలిపారు. వాహనాలు, కంటెయినర్లు, ఫర్నిచర్‌ను నిరసనకారులు తగులబెట్టినట్లు వెల్లడించారు. పోలీసుల చర్యను సమర్థించారు. ఈ మార్చ్‌లో లా ఫ్రాన్స్ ఇన్సొమిస్ (ఎల్‌ఎఫ్‌ఐ) పార్టీకి చెందిన నేతలతో పాటు ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్ పాల్గొన్నట్లు తెలిసింది. మరోవైపు ఈయూ సమావేశం కోసం బ్రసెల్స్‌లో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రోన్ ఫ్రాన్స్ నిరసనల క్రమంలో పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని దేశానికి తిరిగొచ్చారని, మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారని సమాచారం. ఈ ఘటన ఆమోదయోగ్యం కాదని ఆయన ఆక్షేపించినట్లు తెలిసింది.

10కోట్లకు సీపీసీ సభ్యత్వం

బీజింగ్: చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం గణనీయంగా పెరిగింది. సుమారు పది కోట్లకు చేరుకుంది. 2022 చివరికి 98.04 మిలియన్ అంటే 9.804 కోట్ల మంది సీపీసీ సభ్యులుగా ఉన్నారు. 2021 నాటి సభ్యుల సంఖ్యతో పోల్చితే 1.4శాతం పెంపుదల ఉన్నట్లు సీపీఐ కేంద్ర కమిటీ సంస్థాగత శాఖ శుక్రవారం పేర్కొంది. 2022 చివరికి ప్రాథమిక స్థాయిలో 5.07 మిలియన్ల మంది సభ్యులు ఉంటే వార్షిక వృద్ధిరేటు 2.6శాతంగా ఉన్నట్లు వెల్లడించింది. జులై ఒకటో తేదీన పార్టీ 102వ వ్యవస్థాపక దినోత్సవం ఉన్న నేపథ్యంలో తాజా నివేదికను వెలువరించింది. మొత్తం సభ్యుల్లో 29.9శాతం అంటే 2.93 కోట్ల మంది మహిళలున్నారని, హాన్ మినహా సంప్రదాయ వర్గీయులు 7.6శాతం మేర ఉండగా, పట్టభద్రులు 54.7శాతం మంది ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. గతేడాది 2.45 మిలియన్ల మంది పార్టీలో చేరారని, మరో 20.96 మిలియన్ల మంది పార్టీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నట్లు నివేదిక తెలిపింది.

గ్రాండ్ థియేటర్‌లో కాన్సర్ట్

చైనా కమ్యూనిస్టు పార్టీ 102వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని టియాంజిన్ గ్రాండ్ థియేటర్‌లో ఈనెల 28న టింజిన్ సింఫనీ ఆర్కెస్ట్రా ఓ కాన్సర్ట్ నిర్వహించింది. చైనా సింఫనీ గేయం 'గ్రేట్ వాల్'ను 300 మంది బీజింగ్, టియాంజిన్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించారు.

4న ఎస్‌సీఓలో పాల్గొననున్న జిన్‌పింగ్

బీజింగ్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జులై 4వ తేదీన షాంఘై సహకార సంఘం (ఎస్‌సీవో) సదస్సులో పాల్గోనున్నారు. జిన్‌పింగ్ బీజింగ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్‌సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ 23వ సదస్సులో సందేశమివ్వనున్నట్లు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్‌యింగ్ శుక్రవారం ప్రకటించారు. ఇతర దేశాధినేతలతో భవిష్యత్ కార్యచరణపై జిన్‌పింగ్ ఈ సందర్భంగా చర్చిస్తారన్నారు. సంయుక్త చర్యలతో ఎస్‌సీఓ గొప్ప విజయాలు సాధించగలదని విదేశాంగ శాఖ మరొక ప్రతినిధి మావో నింగ్ ఆకాంక్షించారు. వ్యవస్థాపక సభ్యదేశంగా ఎస్‌సీఓకు దౌత్యపరంగా అధిక ప్రాధాన్యతను చైనా ఇస్తుందని చెప్పారు. సభ్యదేశాలతో కలిసి అంతర్జాతీయ పరిణామాల పరిష్కారం, అభివృద్ధి మార్గంలో ముందుకెళ్లేందుకు చైనా సిద్ధంగా ఉందన్నారు. యూరేసియాకు మెరుగైన భవిష్యత్ కల్పనను ఆకాంక్షిస్తోందని చెప్పారు. ఎస్‌సీఓతో సంబంధాలను పెంపొందించుకోవాలని చైనా కోరుకుంటోందని మావో వెల్లడించారు.

పోలీసుల్లో వివక్షపై ఫ్రాన్స్ దృష్టి పెట్టాలి : ఐరాస

జెనీవా: ఫ్రాన్స్‌లో 17ఏళ్ల యువకుడిని పోలీసులు కాల్చి చంపడం వివాదాస్పదంగా మారింది. ఆ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు కొనసాగుతున్నాయి. జాతి వివక్ష, పెరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే క్రమంలో ఐక్యరాజ్య సమితి (ఐరాస) స్పందించింది. పోలీసు వ్యవస్థలో నాటుకుపోయిన వివక్ష సమస్యాత్మకమని, దీనిపై ఫ్రాన్స్ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ఐరాస మానవ హక్కుల కార్యాలయం అధికార ప్రతినిధి రవీనా శందాసినీ వెల్లడించారు. జెనీవాలో విలేకరులతో మాట్లాడిన రవీనా ఫ్రాన్స్‌లో తాజా పరిణామాలపై ఆందోళన వ్యక్తంచేశారు. యువకుడి కాల్చివేతపై దర్యాప్తునకు ఆదేశాలిచ్చారు. కానీ లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో నాటుకుపోయిన వివక్ష, జాత్యహంకారాన్ని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం అవసరమని నొక్కి చెప్పారు.

నిరసనకారులపై పోలీసుల దమనకాండ వెలుగు చూసిన వెంటనే తగు విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రాన్స్‌లో అనిశ్చితి నెలకొన్నదని, ఇప్పటికే అనేక మంది పోలీసు అధికారులకు గాయాలయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక చోట్ల లూటీలు, ఘర్షణలు, హింస చోటుచేసుకున్నట్లు తెలుపుతూ నిరసనలను అదనుగా చేసుకొని ఇటువంటి వాటికి పాల్పడే వారిని ఉపేక్షించరాదని రవీనా శందాసినీ వెల్లడించారు.

వీసీల భర్తీలో రాజకీయం వీడేనా?

(మొదటిపేజీ తరువాయి)

వారి స్థానంలో నూతన వీసీలను నియమించనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వీసీల నియామకంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. చాలా మంది వీసీలు రాజకీయ కోణంలో పనిచేస్తున్నారనే ప్రచారముంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంలోనూ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీ(అనంతపురం)తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల ఇంటర్వ్యూల్లో అర్హతలు లేని వారిని నియమించారంటూ ఇటీవల నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల్లో అడ్డగోలు నియామకాల్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన సంఘాలు పెద్దఎత్తున ఉద్యమించారు. అటు ప్రతిపక్షాలు సైతం వీసీల వైఖరిని తూర్పారబట్టినా ప్రభుత్వ వైఖరిలో మార్పులేదు. పట్టభద్రుల ఎన్నికల్లో ఆంధ్రా విశ్వవిద్యాలయం వీసీ ఏకంగా వైసీపీ నేతల సమావేశానికి హాజరవ్వడం విమర్శలకు దారితీసింది. నాగార్జున విశ్వవిద్యాలయ వీసీపైనా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాగా రాష్ట్రంలోని చాలా మంది వీసీలు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేయడంతో విశ్వవిద్యాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే విశ్వవిద్యాయాల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్ క్రమేపీ దిగజారుతోంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉన్న ఆంధ్రా విశ్వవిద్యాలయం ర్యాంకింగ్ తగ్గిపోయింది. దీనికి సమర్థత గల వీసీలను నియమించకపోవడం, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తగినంతగా సహకరించకపోవడమే కారణమన్న ప్రచారముంది.

మార్గదర్శకాలు పేరుకేనా?

వీసీల నియామకానికి యూజీసీ నిబంధనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి అనేక మార్గదర్శకాలను జారీజేసింది. ఇవి పేరుకేనా?, లేక పటిష్టంగా అమలు చేస్తారా? అనే అనుమానాలు ఉన్నాయి. ఈ విశ్వవిద్యాలయాలకు మూడేళ్ల కాల పరిమితి ప్రాతిపదికన వీసీలను నియమించనున్నారు. నియమితులైన వారికి యూజీసీ నిబంధనల ప్రకారం రూ.2లక్షల పదివేల వేతనం ఉంటుంది. అత్యున్నత స్థాయి సమర్థత, సమగ్రత, నైతికత, సంస్థాగత నిబద్ధత, విశ్వవిద్యాలయ వ్యవస్థలో ప్రొఫెసర్‌గా కనీసం 10 సంవత్సరాల అనుభవం లేదా తత్సమాన హోదాలో అపారమైన అనుభవం తదితర అర్హతలు గల వారిని ఈ వీసీల పోస్టులకు దరఖాస్తు చేసేలా మార్గదర్శకాలను జారీజేశారు. ఇప్పటికే చాలా విశ్వవిద్యాలయాల్లో అర్హతగల వారిని పక్కనపెట్టి, రాజకీయ జోక్యంతో వీసీలను నియమించినట్లు సమాచారం. ఈ విడతైనా అలా జరగకుండా అర్హతగల వారిని వీసీలుగా నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

పేలిన రియాక్టర్లు

- ఇద్దరు కార్మికుల మృతి
- అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి(రాంబిల్లి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో గల సాహితి ఫార్మా కంపెనీలో శుక్రవారం ఉదయం రెండు రియాక్టర్లు పేలడంతో భారీ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. మంటలు పూర్తిస్థాయిలో వ్యాపించి సమీప ప్రాంతాన్ని పొగతో కప్పేసింది. దీంతో కంపెనీలో ఉన్న 35 మంది కార్మికులు, సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కాగా ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. క్షతగాత్రులకు అవసరమైన వైద్యసేవలు అందిస్తామని తెలిపింది. ప్రమాద విషయం తెలుసుకున్న జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక అధికారులు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కొన్ని గంటల వరకు మంటలు అదుపులోకి రాలేదు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత అధికారులు కంపెనీ లోపలికి వెళ్లి చూడగా రమేశ్ (భువనేశ్వర్), సత్తిబాబు (జంగాలపాలెం), నూకినాయుడు (పంచదార్ల), తిరుపతి (విజయనగరం), ఎస్.రాజబాబు (రేబాక), ఎస్. అప్పారావు(నక్కపల్లి), పి.సంతోశ్‌కుమార్ (కొండకొప్పాక) తీవ్ర గాయాలతో పడి ఉన్నారు. వారిని చికిత్స కోసం విశాఖ ఆసుపత్రులకు తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ సత్తిబాబు, తిరుపతి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ప్రమాద సమయంలో కంపెనీలో 35 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, టీడీపీ సమన్వయకర్త ప్రగడ నాగేశ్వరరావు తదితరులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే తరచూ ప్రమాదాలు: ఓబులేసు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో గల సాహితి ఫార్మా కంపెనీలో శుక్రవారం ఉదయం రెండు రియాక్టర్లు పేలడంతో సంభవించిన భారీ ప్రమాదం ఇద్దరు కార్మికులు మరణించడంపై ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు విచారం వ్యక్తంచేశారు. విశాఖ చుట్టుపక్కల పారిశ్రామికవాడల్లో ఈ విధమైన ప్రమాదాలు జరగడం, కార్మికులు ప్రాణాలు కోల్పోవడం సర్వసాధారణమైపోయిందన్నారు. తరుచూ ఈ విధమైన ప్రమాదాలు జరుగుతున్నా పరిశ్రమల శాఖాధికారులుగానీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌గానీ పట్టించుకోవడంలేదని విమర్శించారు. పరిశ్రమల శాఖ మంత్రి డబ్బు సంపాదన, కమీషన్లు దండుకోవడంపైనే దృష్టి పెడుతున్నారు తప్ప ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఓబులేసు విమర్శించారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యం, ఇతరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబానికి రూ. 50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలనీ, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనీ, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఓబులేసు డిమాండ్ చేశారు.

బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి అమర్‌నాథ్

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదం చాలా దురదృష్టకరమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం సాయంత్రం అమర్‌నాథ్ పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ సాహితీ ఫార్మా కంపెనీలో ఉదయం షిఫ్ట్‌లో 35 మంది పనిచేస్తున్నారని, కంటైనర్‌లో సాల్వెంట్ లోడ్ చేస్తున్నప్పుడు ప్రమాదం జరిగి మంటలు చెలరేగాయని చెప్పారు. ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా నలుగురిని కిమ్స్ ఆస్పత్రికి, ఇద్దరిని కేజీహెచ్‌కి, ఒకరిని అచ్యుతాపురం ఆసుపత్రికి తరలించినట్లు మంత్రి పేర్కొన్నారు. దుర్ఘటనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారని చెప్పారు. ప్రమాదానికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రమాదంలో జంగాలపాలేనికి చెందిన పైలా సత్తిబాబుకు 95 శాతం గాయాలు కావడంతో అతడు మరణించాడని, విజయనగరం జిల్లాకు చెందిన ఉప్పాడ తిరుపతికి ఊపిరితిత్తులు దెబ్బతిని చనిపోయాడని మంత్రి అమర్‌నాథ్ తెలియజేశారు. మృతుల కుటుంబాలకు 25 లక్షల రూపాయలు చొప్పున సీఎం జగన్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు తెలిపారు.

పాత మిత్రుల కోసం బీజేపీ వెంపర్లాట

- అధికారమే లక్ష్యంగా కూటమి బలోపేతానికి చర్యలు
- వచ్చే నెలలో 'ఎన్డీయే' సమావేశాలు

న్యూఢిల్లీ: విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ వెన్నులో వణుకుపుడుతోంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారానికి దూరం చేసేందుకు ప్రతిపక్షాలు ఇప్పటికే సమాలోచనలు ప్రారంభించాయి. అందులో భాగంగా జూన్ 23న పాట్నాలో సమావేశమై ఐక్యపోరుకు సంకల్పించాయి. జులై 13, 14 తేదీల్లో బెంగళూరులో రెండవ విడత సమావేశానికి సమాయత్తమవుతున్న వేళ బీజేపీ తన పాత మిత్రులను దగ్గరకు చేర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఎన్డీయేలో భాగంగా ఉండి తర్వాత దూరమైన తమ పార్టీలను తిరిగి కూటమిలోకి తెచ్చుకొని బలపడాలని, తద్వారా అధికారాన్ని తిరిగి చేపట్టాలని భావిస్తోంది. ఇందుకోసం కసరత్తు చేస్తోంది. ఉద్ధవ్ ఠాక్రే- శివసేన, శిరోమణి అకాలీ దళ్, జనతా దళ్ (యునైటెడ్) వంటి పార్టీ గతంలో ఎన్డీయేతో కలిసివుండి తర్వాత అనేక కారణాలతో కటీఫ్ చెప్పేశాయి. ఇదే క్రమంలో తమ బలాన్ని అంచనా వేసుకునేందుకు త్వరలోనే ఎన్డీయే సమావేశం కానున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇలాంటి సమయంలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగితే ఆయా మిత్రపక్షాలకు స్థానం కల్పించే అవకాశం లేకపోలేదన్న అంచనాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతానికి మోదీ మంత్రిమండలిలో మిత్రపక్షాలకు చెందిన మంత్రులు ముగ్గురు ఉన్నారు. వారిలో ఆర్‌ఎల్‌జేపీకి చెందిన పశుపతి కుమార్ పారస్ మాత్రమే మంత్రి కాగా అనుప్రియా పటేల్ (అప్నాదళ్), రామదాస్ అథావలె (ఆర్‌పీఐ) సహాయ మంత్రులుగా ఉన్నారు. పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవాన్ని బహిష్కరించాలన్న కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్ష పార్టీల నిర్ణయాన్ని విమర్శించే బీజేపీ ప్రకటనకు 13 పార్టీలు మద్దతిచ్చాయి. ఆ ప్రకటనపై సంతకాలు చేసిన నేతల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి కె.పళనిస్వామితో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోని అధికార పక్ష నాయకులు ఉన్నారు. కాగా, షిండే గురువారం రాత్రి బీజేపీ సీనియర్లతో దేశ రాజధానిలో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ సమావేశానికి అజెండా ఏమిటన్నది ప్రశ్నార్థం. కేంద్రకేబినెట్ పునర్వ్యవస్థీకరణ, మహారాష్ట్ర కేబినెట్ విస్తరణపై చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. బీహార్‌లోని ఆర్‌జేడీ- ఏడీ(యూ) క్యాంపులోని చిన్న పార్టీలను తమ ముగ్గులో దింపేందుకు బీజేపీ శాయశక్తులు ఒడ్డుతోంది. ఆ రాష్ట్రంలో బలాన్ని పెంచుకునేందుకు తహతహలాడుతోంది. కేంద్ర మాజీమంత్రి ఉపేంద్ర కుశ్వాహా తన సొంత పార్టీ పెట్టేందుకు జేడీ(యూ)ను వీడారు. మాజీ ముఖ్యమంత్రి జితన్ రాం మాంఝీ ఇటీవల బీజేపీ అధిష్ఠానాన్ని కలిశారు.

రుణభారత్

(మొదటిపేజీ తరువాయి)

పోల్చితే 1.1 బిలియన్ డాలర్లు తగ్గిందని నివేదిక పేర్కొంది. స్వల్పకాలిక రుణవాటా మొత్తం 20.6శాతానికి పెరుగగా 2022 మార్చి చివరికి 19.7శాతంగా ఉంది. అదే విధంగా విదేశీ మారక నిల్వలకు సంబంధించి స్వల్ప కాలిక రుణ నిష్పత్తి 22.2శాతం పెరిగింది. డాలర్లలో ఉన్న అప్పు భారత్‌కు సమస్యగా మారిందని ఆర్బీఐ తెలిపింది. 2023 మార్చి ముగిసే నాటికి విదేశీ రుణవాటా 54.6శాతంగా ఉన్నట్లు తెలిపింది. ఇక భారతీయ రూపాయల్లో ఉన్న రుణం 29.8శాతంగా ఉంటే ఎస్‌డీఆర్ (6.1శాతం), యెన్ (5.7శాతం), యూరో (3.2శాతం)గా ఉన్నట్లు వెల్లడించింది. విదేశీ రుణంలో లోన్ల వాటా (32.5శాతం) ఎక్కువ కాగా కరెన్సీ, డిపాజిట్లు (22.6శాతం), ట్రేడ్ క్రెడిట్, అడ్వాన్స్‌లు (19.9శాతం)గా ఉన్నాయి.

రాజీనామాపై మణిపూర్ సీఎం హైడ్రామా

- రాజ్‌భవన్‌కు బయల్దేరి తిరిగి ఇంట్లోకి
- మద్దతుదారులు ఒప్పుకోట్లేదని ట్వీట్

ఇంఫాల్: రెండు నెలుగా చోటుచేసుకున్న అల్లర్లను అదుపుచేయడంలో విఫలమైన మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ ఎన్. సింగ్ శుక్రవారం రాజీనామా పేరుతో హైడ్రామాకు తెరతీశారు. ఉద్రిక్త పరిస్థితులకు బాధ్యతవహిస్తూ ముఖ్యమంత్రి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే, మద్దతుదారులు ఒప్పుకోవడంలేదంటూ చివరి నిమిషంలో మనసు మార్చుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తాను రాజీనామా చేయడం లేదని బీరేన్ సింగ్ ట్విటర్‌లో వెల్లడించారు. ఈ క్రమంలోనే చించేసిన రాజీనామా పత్రం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యమంత్రి రాజీనామా చేయనున్నట్లు ఈ ఉదయం నుంచి వార్తలు వచ్చాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఆయన రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ అనసూయ ఉకియ్‌తో భేటీ కానున్నట్లు వివిధ మీడియాల్లో కథనాలు వచ్చాయి. ఈ వార్తలు బయటకు రాగానే సీఎం నివాసానికి మహిళా మద్దతుదారులు చేరుకున్నారు. తాము సీఎంను వెళ్లనివ్వబోమంటూ మానవహారంలా ఏర్పడ్డారు. ఈ క్రమంలోనే ఈ మధ్యాహ్నం ఇంఫాల్‌లోని తన నివాసం నుంచి కాన్వాయ్‌లో బయటకు వచ్చిన సీఎం మద్దతుదారులకు అభివాదం చేశారు. కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా మహిళలు అడ్డుకోవడంతో తిరిగి తన నివాసం లోపలికి వెళ్లిపోయారు. 'ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయను' అని సీఎం అనంతరం ట్వీట్ చేశారు. గిరిజన వర్గాల మధ్య గొడవ ఈశాన్య రాష్ట్రాన్ని తగులబట్టేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇంఫాల్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మయితే వర్గీయులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించే అంశం కుకీ వర్గీయులకు మధ్య అగ్గికి ఆజ్యం పోసిన పని చేసింది. సుమారు రెండు నెలలుగా అల్లర్లు కొనసాగుతుండగా 120 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో ఉద్రిక్తతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమనే విమర్శల వచ్చాయి. దీంతో సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయాలనే డిమాండ్ పెరిగింది. పదవి నుంచి తప్పుకోవాలని అధిష్ఠానం కూడా సూచించగా బీరేన్ సింగ్ రాజీనామా డ్రామా నడిపారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

విలవిలలాడుతున్నదని చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపు సమంజసం కాదని చెప్పడానికి కూడా అందుబాటులో లేని ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. విద్యుత్ వినియోగదారుల పక్షాన సీపీఐ నిలబడుతోందని, అందుకే పది వామపక్ష పార్టీలు ఓకే తాటిపైకి వచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల కొనుగోలులోనూ జగన్ మాయ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజస్థాన్‌లో ఒక్కో మీటర్ ధర రూ.9600 ఉంటే మన రాష్ట్రంలో రూ.36,976 ఎందుకు వెచ్చిస్తున్నారని ప్రశ్నించారు. జగన్ బినామీ కంపెనీల ఖాతాల ద్వారా రాష్ట్ర ప్రజానీకం నుంచి లక్షల కోట్ల రూపాయలు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలుతోందని విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలు అమలు చేసేది లేదని తెలంగాణ ప్రభుత్వం కరాఖండిగా చెపుతుంటే... చేతకాని దద్దమ్మ జగన్ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. ఈ ఆందోళనలు ఇంతటితో ఆపబోమని, ముమ్ముందు మరిన్ని ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.గంగారావు, సీపీఐ ఎంఎల్ ఎన్‌డీ జిల్లా కార్యదర్శి ఎం.లక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు ఎ.విమల, ఎం.కృష్ణారావు, జి.రాంబాబు, జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, పి.చంద్రశేఖర్, కుమారి, సీఎన్ క్షేత్రపాల్ తదితరులతో పాటు వామపక్ష పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి: రామచంద్రయ్య

పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని కోరుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల అధ్వర్యాన పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు జరిగాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య పత్తికొండలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలులో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డోన్‌లో, సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు నంద్యాలలో పాల్గొన్నారు.

చార్జీలు తగ్గించకుంటే పతనం తప్పదు: జంగాల

పెంచిన విద్యుత్ చార్జీలను, సర్దుబాటు చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ప్రభుత్వ పతనం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ హెచ్చరించారు. విద్యుత్ చార్జీల పెంపుపై గుంటూరులోని లిబర్టీ థియేటర్ ఎదురుగా ఉన్న విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినీకాంత్, జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, సీపీఐ నాయకులు బి.వెంకటేశ్వర రెడ్డి, నూతలపాటి చిన్న, మంగా శ్రీనివాస్, దూపాటి వెంకటరత్నం, వామపక్ష నాయకులు సుధ, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి దోపిడీ: దేగా ప్రభాకర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై విద్యుత్ వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు దేగా ప్రభాకర్ మండిపడ్డారు. ఏలూరులో చేపట్టిన నిరసన కార్యక్రమంలో దేగా ప్రసంగించారు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండేటి బేబీ, నూజివీడులో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, కొయ్యలగూడెంలో జమ్మి శ్రీనివాసరావు, టీవీఎస్ రాజు, కుక్కునూరులో మైసాక్షి వెంకటాచారి, అయితా సురేశ్, వేలేరుపాడులో బాడిస రాము, చింతలపూడిలో కంచర్ల గురవయ్య, తొర్లపాటి బాబు తదితరులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లుబోయిన రంగారావు, ఎం సీతారాం ప్రసాద్, తాడేపల్లిగూడెంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో

ప్రజలకు భారంగా మారిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించకపోతే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని వామపక్ష పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నదియా, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కందారపు మురళి, నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో

విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్, జనసేన, లోక్‌సత్తా పార్టీల అధ్వర్యాన శృంగవరపుకోట దేవీ కూడలి నుంచి కరెంట్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ జరిగింది. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కామేశ్వరరావు, మద్ది కృష్ణ, దేగల అప్పలరాజు, మోపాడ మధు, షేక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌జిల్లా

జి.కొండూరు సబ్ స్టేషన్ వద్ద నిర్వహించిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగ్గయ్యపేట డిపో సెంటర్ వద్ద విద్యుత్ కార్యాలయం, సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి విద్యుత్ బిల్లును తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పాల్గొన్నారు. విజయవాడ నగరంలోని పాలిటెక్నిక్ రోడ్‌లోని విద్యుత్ సౌధా వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పాల్గొన్నారు. తిరువూరు, ఏకొండూరు, పెనుగంచిప్రోలులో కూడా నిరసన కార్యక్రమాలు జరిగాయి. కృష్ణాజిల్లా గంగూరు విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టి.తాతయ్య మచిలీపట్నంలో సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, చల్లపల్లిల్లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, మొవ్వ మండలం కాజ గ్రామం, గన్నవరంలో ధర్నా కార్యక్రమాలు జరిగాయి.

మద్య నిషేధమని లక్ష కోట్లు పిండారు

జగన్ ఓడాలి...రాష్ట్రం గెలవాలి: చంద్రబాబు

టీడీపీలోకి వైసీపీ కృష్ణాజిల్లా నేత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ అధికారంలోకి వస్తే మద్య నిషేధం విధిస్తానని చెప్పిన జగన్, పేద ప్రజల నుంచి జే బ్రాండ్ల ద్వారా రూ.లక్ష కోట్లు పిండారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం చంద్రబాబు సమక్షంలో కృష్ణా జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, అతని అనుచరులు, మద్దతు దారులు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రాన్ని తెలుగు దేశం తప్ప ఎవరూ కాపాడలేరని తెలుసుకుని పార్టీలోకి వచ్చిన సుభాష్ చంద్రబోస్‌ను అభినందిస్తున్నా అన్నారు. 'నేను ఒకటే చెపుతున్నా...వచ్చే ఎన్నికల్లో జగన్ ఓడాలి...రాష్ట్రం గెలవాలి. అప్పుడే ప్రజలకు మంచి జరుగుతుంది' అన్నారు. కరుడుగట్టిన నేరస్థుడిని సీఎంని చేసి ప్రజలంతా మోసపోయారు... పోలవరం పూర్తి అయ్యి ఉంటే రాష్ట్రం సుభిక్షం అయ్యేది. తెలంగాణకు హైదరాబాద్ ఉన్నట్లు...మనకు అమరావతి ఉండాలని ప్రయత్నించాను. జగన్ మూడు రాజధానులు అని అమరావతిని ఆపేశాడు. విశాఖ ను ఎంత నాశనం చేశాడో చూశాం. అమరావతి పూర్తి అయ్యి ఉంటే మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు వచ్చేవి....కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కృష్ణా డెల్టాకు నీటి కష్టాలు లేకుండా పట్టిసీమ కట్టాను. పోలవరం కట్టడానికి 5 ఏళ్లు పడుతుందని ఏడాదిలో పట్టిసీమ పూర్తి చేశాను. నీళ్లు ఇచ్చాను.నేను తెచ్చిన పట్టిసీమ నీళ్లు తాగారు కానీ నన్ను మీరు మరిచిపోయారు.

కృష్ణ, గోదావరి నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరు ఇవ్వొచ్చు అని ప్రణాళికలు సిద్ధం చేశాం. ఒక అసమర్థుడు, అవినీతి పరుడు సీఎం అయితే ఏమవుతుందో పోలవరం చూస్తే అర్థం అవుతుంది. పోలవరంలో నిర్మాణ సంస్థలను, అధికారులను మార్చి ప్రాజెక్టుకు నష్టం చేశారు. జగన్ ప్రభుత్వం 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. ఇది గమనించే నాడు సోలార్ విద్యుత్ ను ప్రోత్సహించాం. మనం అధికారంలో ఉండి ఉంటే విద్యుత్ చార్జీలు పెంచాల్సిన అవసరం ఉండేది కాదు. మోటార్లకు మీటర్లు పెట్టి.....రైతులకు ఉరితాళ్లు బిగించారు. సైకో పోవాలి....సైకిల్ రావాలి. అప్పుడే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలు తిరస్కరించండి

ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ రంగాన్ని సంస్కరణల పేరుతో ఆదానికి ఇవ్వడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలను ప్రతి ఒక్కరూ తిరస్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సంస్కర ణల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. విద్యుత్ సంస్కరణలు వేగంగా అమలు చేసేందుకు రూ.9,574 కోట్ల రుణాలు తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అనుమతి ఇచ్చిందని తెలిపారు. విద్యుత్ రంగ సంస్కరణలను వేగవంతం చేసేందుకు రాష్ట్రాలకు ఆర్థిక ప్రోత్సాహాల పేరుతో కేంద్ర ప్రభుత్వం 12 రాష్ట్రాలకు రూ 66.413కోట్లు అప్పులు తీసుకునేందుకు కేంద్రం పచ్చ జెండా ఊపిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిమితికి మించి రుణాలు తీసుకుంటోందని వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు విద్యుత్ మోటార్లు బిగించి అధిక వసూళ్లు చేసే విధంగా చర్యలు చేపట్టబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు ప్రభుత్వ రంగంలోని విద్యుత్ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకే ఈ విద్యుత్ సంస్కరణలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును స్టాండింగ్ కమిటీ పరిశీలించక ముందే దొడ్డిదారిన సంస్కరణలు అమలుచేయడం సరైంది కాదన్నారు. సంస్కరణలు ఉపసంహరిం చుకోకపోతే రైతు ఉద్యమం తరహాలో ప్రజా ఆగ్రహానికి మోదీ ప్రభుత్వం గురించికాక తప్పదని ఆ ప్రకటనలో ఓబులేసు హెచ్చరించారు.

'పీఎఫ్ హయ్యర్ పెన్షన్'తో

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం: ఈయూ

విశాలాంధ్ర-విజయవాడ: పీఎఫ్ హయ్యర్ పెన్షన్‌తో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం కలుగు తుందని ఏపీ పీటీడీ(ఆర్టిసి)ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య తెలిపారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ బృందం శుక్రవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిసి హయ్యర్ పెన్షన్ గురించి చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ,ప్రైవేటు రంగాలలో పనిచేసే ఉద్యోగుల సంక్షేమంకోసం 1995 కు ముందు ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్(ఎఫ్‌పీఎస్) ఉండేదన్నారు. దానిస్థానంలో ఎంప్లాయి పెన్షన్ స్కీమ్(ఈపీయఫ్) పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టి హయ్యర్ పెన్షన్ కు ఆప్షన్ ఇచ్చినప్పటికీ చాలా మంది ఉద్యోగులకు దానిపై అవగాహన, సరైన సమాచారం లేక హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇవ్వలేక పోయారని చెప్పారు. చాలా మంది ఉద్యోగులు, పెన్షనర్ అసోషియేషన్లు, ట్రేడ్ యూనియన్లు హయ్యర్ పెన్షన్ అవకాశం కల్పించాలని అనేక పోరాటాలు చేసినా ఫలితం లేకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించటం జరిగిందన్నారు. కోర్టు ఆదేశాలమేరకు ఈపీఎఫ్ స్కీమ్ లో ఉద్యోగులు పనిచేస్తున్న విభాగాలలో సంబంధిత మేనేజ్ మెంటు అంగీకరిస్తే హయ్యర్ పెన్షన్ ఇవ్వడానికి అభ్యంతరం లేదని తెలియజేయాల్సి ఉందన్నారు. అభ్యంతరం లేనివారు ఆన్ లైన్ లో ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు జులై 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా హయ్యర్ పెన్షన్ అమలు కోసం ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటూ క్రిందిస్థాయి అధికార్లకు సూచనలు ఇస్తూ ఆర్టీసీ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ రావడానికి కృషి చేసిన ఆర్టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును సత్కరించారు. అప్పీళ్లను పాత పద్ధతిలోనే పరిష్కరించేలా, ప్రమోషన్లు కూడా పాతసర్వీస్ రూల్ ప్రకారం ఇవ్వాలని గతంలో ఈయూ ఇచ్చిన అభ్యర్థనలు పరిగణలోకి తీసుకోవాల కోరగా త్వరలో ఇందుకు సంబంధించిన ఆదేశాలు వస్తాయని దీనిపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని ఎండీ తెలిపారు. ఆర్టిసి ఎండీని కలిసిన వారిలో ఈయూ ఉపప్రధానకార్యదర్శి ఎం.డి.ప్రసాద్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్లు ఎస్.కె.సుభాని, కె.నాగేశ్వరరావు, కోశాధికారి సిద్దిక్, రాష్ట్రకార్యదర్శి టి.వి.భవాని, ఉపాధ్యక్షులు ఏ రామచందర రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యస్.కె.మొహీద్దిన్, రాష్ట్ర సహాకార్యదర్శులు ఎస్.ఎస్.నారాయణ, జి.ఎస్. నారాయణ,హెడ్ ఆఫీసు అధ్యక్షులు ఏఆర్‌సీహెచ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటినుంచి జగనన్న సురక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీనిపై ఇప్పటికే సీఎం జగన్ సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన లబ్ధిదారులకు అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్షను ఏర్పాటు చేశారు. నెల రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అర్జీదారులకు అందజేస్తారు. వాటి కోసం ఇప్పటికే వలంటీర్ల ద్వారా దరఖాస్తులు తీసుకుని, వారికి టోకెన్ కేటాయించి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ నంబరు నమోదు చేశారు. ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానాన్ని నిర్వహిస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత ఉండి, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు పొందలేక దూరమైన వారి కోసం ఈ కార్యక్రమాన్ని సంకల్పించారు. అలాంటి వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జగనన్న సురక్ష విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల్లోనూ ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించారు.

పార్టీ నేతలు క్రియాశీలకంగా ఉండాలి:

విజయసాయిరెడ్డి:జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జులై ఒకటి నుంచి మండల స్థాయి అధికారులు ఏర్పాటు చేయనున్న శిబిరాల్లో పార్టీ నాయకులు క్రియాశీలకంగా ఉండాలని వైసీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్, ఎంపీ వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు, పరిశీలకులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారని తెలిపారు.

మూడేళ్ల డిగ్రీ విద్య కొనసాగించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ: నాలుగేళ్ల డిగ్రీ పద్ధతిని ఉపసంహరించుకుని మూడేళ్ల డిగ్రీ విధానాన్ని కొనసాగించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.జాన్సన్ బాబు, కె.శివారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం స్థానిక దాసరి నాగభూషణరావు భవన్‌లో జాన్సన్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల డిగ్రీ విద్యా విధానానికి బదులు నాలుగేళ్ల డిగ్రీ విధానాన్ని అమలు చేస్తామని చెప్పడాన్ని ఖండించారు. మేజర్ సబ్జెక్ట్, మైనర్ సబ్జెక్ట్ చేస్తున్నామని చెప్పడాన్ని చూస్తే మూడేళ్ల మేజర్ సబ్జెక్టులు చదివిన విద్యార్థులకు ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారని మేజర్ సబ్జెక్టు ఒకటి చదవడం వలన ఎవరికి ఉపయోగకరమనీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రైవేట్ కళాశాలలో 159 మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెడుతూ ప్రభుత్వ కళాశాలలో మాత్రం 82 మేజర్ సబ్జెక్టులు ప్రవేశపెట్టడం చూస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పెంచి పోషిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేయడానికి కంకణం కట్టుకుందని విమర్శించారు. డిగ్రీపై విద్యార్థులకు తల్లిదండ్రులకు లెక్చరర్లకి అధ్యాపకులకు ఎటువంటి అవగాహన కల్పించకుండా ఎవరి కోసం డిగ్రీ విద్యా విధానంలో ఈ మార్పులు చేస్తున్నారన్నారని ప్రశ్నించారు. తక్షణమే నాలుగేళ్ల డిగ్రీ విద్యా విధానాన్ని విరమించుకుని పాత పద్ధతిలోనే మూడేళ్ల డిగ్రీ విద్యా విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధనా, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయకుండా ఏ విధంగా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు, జి. ఫణీంద్ర, జి.ఓబులేసు, షేక్ మస్తాన్, బి. నాసర్, ఎం. సాయి కుమార్, ఎన్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన శాంతిరాముడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నంద్యాల శాంతిరామ్ విద్యాసంస్థల అధినేత ఎం.శాంతిరాముడు సీఎం క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్ సమక్షంలో శుక్రవారం వైసీపీలో చేరారు. శాంతి రాముడుతోపాటు ఆయన తనయుడు శివరామ్ కూడా వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సీఎం జగన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర, కిశోర్‌రెడ్డి, కాటసాని రామ్‌భూపాల్‌రెడ్డి హాజరయ్యారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచండి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు నాయకుల వినతి

విశాలాంధ్ర-గుంటూరు: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ, ప్రధాన కార్యదర్శి లలిత, నాయకులు సరోజమ్మ, హెల్డా ఫ్లొరెన్స్, క్రిస్టియా నమ్మ, దుర్గ కోరారు. ఓబులేసు నాయకత్వంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నేతలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీతను గుంటూరులోని తన కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ప్రధాన సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గ్రేడ్-2 పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణకు సంబంధించి బరువులు, ఎత్తుల మిషన్లు ఇవ్వాలన్నారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్చాలన్నారు. ప్రతినెల వేతనాలు, బిల్లులు సక్రమంగా చెల్లించాలని, పాలకు సంబంధించి వర్కర్, హెల్పర్ మాత్రమే బయోమెట్రిక్ వేసేలా చూడాలన్నారు. వర్కర్లు, హెల్పర్ల బదిలీలు, పదోన్నతుల విషయంలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరారు. విధులలో చనిపోయిన వారికి రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని, దహన సంస్కారానికి రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

కాగా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రేమ అధ్యక్షతన ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సమావేశం విజయవాడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం జరిగింది. జి.ఓబులేసుతో పాటు వివిధ జిల్లాల ఆఫీస్ బేరర్లు హాజరయ్యారు. అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించిన వర్కర్లు, హెల్పర్ల ప్రధాన సమస్యలపై చర్చించారు. ప్రీస్కూల్ పిల్లలకి వండి వడ్డించడానికి పాత్రలు, ప్లేట్లు, గ్లాసులు త్వరితగతిన సరఫరా చేయాలన్నారు. జులై 8, 9 తేదీలలో ఒంగోలులో యువ మహిళల తరగతులు జరగనున్నాయని, విజయవాడలో జులై 18న ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పునరావాసం తర్వాతే ప్రాజెక్టు

మోదీకి భయపడి నిర్వాసితులకు జగన్ అన్యాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: నిర్వాసితుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ, భూమికి భూమి, ఇంటికి ఇల్లు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. సీపీఎం చేపట్టిన పోలవరం పోరు కేక పాదయాత్ర 11వ రోజు శుక్రవారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసి తులను నిర్లక్ష్యం చేస్తున్నాయని శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రోజూ మీడియాలోనూ, రాజకీయంగా చర్చ జరుగుతోందని, కానీ నిర్వాసితుల గురించి ఎవరూ మాట్లాడటం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు. తమ పాదయాత్రకు వైసీపీ నేతలు కూడా సంఘీభావం తెలియజేస్తూ నిర్వాసితుల సమస్యలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. టీడీపీ, జనసేన బహిరంగంగా మద్దతు ఇస్తుండగా ఉపాధ్యాయ, కార్మికసంఘాలు, మేధావులు, ప్రముఖులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని చెప్పారు. నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన పది లక్షల ప్యాకేజీ, భూమి పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. జీలుగుమిల్లి, బుట్టాయిగూడెంలో నిర్మించిన పునరావాస కాలనీలు నరకకూపాలుగా మారాయన్నారు. తాగునీరు, వైద్యం, ఉపాధి, పాఠశాల వంటి సదుపాయాలు లేవన్నారు. ముఖ్యంగా శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూమికి భూమి కింద వివాదాస్పద భూములు ఇచ్చారని, పెద్ద ఎత్తున భూసేకరణ జరగడంతో స్థానికులకు పని లేకుండా పోయిందన్నారు. నిర్వాసితులకు ఇచ్చిన చాలా భూములు ఇప్పటికీ భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు గానీ, ప్రత్యేక డీఎస్సీ కల్పించలేదన్నారు. నిలదీసి అడిగిన నిర్వాసితులను పెన్షన్, సంక్షేమ పథకాలు ఇవ్వబోమని బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. పునరావాసం కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రంతో పోట్లాడి నిధులు తేవాల్సిన సీఎం జగన్ ప్రధాని మోదీకి భయపడి నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని శ్రీనివాస రావు విమర్శించారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పోలవరం ఎమ్మెల్యే బాలరాజు గడపగడపకు పేరుతో నిర్వాసిత కాలనీలను సందర్శిస్తే సమస్యలు తెలుస్తాయన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు మాట్లాడుతూ పోలవరం పోరు కేక యాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పాదయాత్రను మహత్తర పోరాటంగా అభివర్ణించారు. నిధులు అడిగే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.గఫూర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి వి.రవి కిరణ్, నాయకులు కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్సే ప్రత్యామ్నాయం

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్సే ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని, కర్నాటక ఎన్నికల గెలుపు తర్వాత దేశంలో కాంగ్రెస్ బలపడుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన అన్ని పార్టీలు బీజేపీకి అనుబంధంగా మారాయన్నారు. ఆ మూడు పార్టీల అగ్ర నాయకులూ రాష్ట్రానికి బీజేపీ చేస్తున్న అన్యాయంపైన ఒక్క మాట కూడా మాట్లాడలేక పోతున్నారని దుయ్యబట్టారు. వైసీపీకీ టీడీపీ, జనసేన ప్రత్యామ్నాయం కాదని, బీజేపీ అంటే రాష్ట్రంలో బాబు, జగన్, పవన్ అని తేలిపోయిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలకి నిజమైన ప్రజా ప్రత్యామ్నాయం కాంగ్రెస్సేనని పునరుద్ఘాటించారు. చిత్తూరు జిల్లాలో 25లక్షల పాడి రైతుల భాగస్వామ్యం ఉన్న విజయ డెయిరీని తాము అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లల్లో పునరుద్ధరిస్తామంటూ నాడు పాదయాత్రలో హామీ ఇచ్చిన జగన్, నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు గుజరాత్‌కు చెందిన అమూల్‌కి తాకట్టు పెట్టడమంటే ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, డాక్టర్ శాస్త్రి జంధ్యాల, నాగేశ్వరరావు, అన్సారీ, సాంబశివరావు, కొమ్మినేని సురేశ్ పాల్గొన్నారు.

పొరుగు సేవల ప్రాతిపదికన 'ఆప్కో'లో ఉద్యోగవకాశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలోని ఆప్కో చేనేత వస్త్ర విక్రయ శాలల్లో మేనేజర్లు, అమ్మకాల సహాయ కులుగా పని చేసేందుకు అర్హత కలిగిన వారిని నేరుగా ఇంటర్వ్యూకి ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ఎండీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విక్రయ రంగంలో ఆసక్తి కలిగి ఇంటర్ లేదా డిగ్రీ ఉత్తీర్ణతతో మంచి కమ్యూనికేషన్ నైపుణ్యం కలిగిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. అభ్యర్థులు పూర్తి వివరాలు కలిగిన బయోడేటాతో జులై మూడవ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడలోని ఆప్కో కేంద్ర కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని వివరించారు. ఎంపికైన వారికి కనిష్ఠంగా రూ. 9వేలకు పైబడి, వారి పనితీరు ఆధారంగా వేతనం నిర్ణయిస్తామని ఎండీ తెలిపారు. ఆప్కో సంస్థ, విక్రయశాలల వివరాలు గురించిన పూర్తి సమాచారం ఏపీ ఆప్కో వెబ్ సైట్ నుంచి తెలుసుకోవచ్చునని వివరించారు.

జగన్‌కు గుణపాఠం తప్పదు

వడ్డే శోభనాద్రీశ్వరరావు హెచ్చరిక

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్): అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని... నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు హెచ్చరిం చారు. ఇప్పటికి ఎన్నిసార్లు విన్నవిం చినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం, పంట నష్టపరిహారం, సాగునీటి ప్రాజెక్టులు, విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, వడ్డీ రాయితీ తదితర రైతు సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఇచ్చిన చలో విజయవాడ పిలుపు మేరకు శుక్రవారం ధర్నాచౌక్ వద్ద నిరసన సభ జరిగింది. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విత్తనం నుండి విక్రయం వరకు రైతుభరోసా కేంద్రాలు చూసుకుంటాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా మిల్లర్లు, వ్యాపారుల పెత్తనమే సాగుతోందన్నారు. ఢిల్లీ తరహా రైతు ఉద్యమాల తోనే సమస్యలు పరిష్కారమవు తాయని స్పష్టంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరం కుశ విధానాలపై ఆందోళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతుంటే...ప్రభుత్వం పట్టించు కోవటం లేదన్నారు. నీటి ప్రాజెక్టులను గాలి కొదిలేసిందని విమర్శించారు. సీపీఎం సీనియర్ నేత పి.మధు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించి వారిని ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. రైతు లను ఆదుకోకపోతే జగన్‌కు గుణపాఠం తప్ప దని హెచ్చరించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవ రావు మాట్లా డారు. సభలో వి.ఉమా మహేశ్వరరావు, మాగంటి హరిబాబు, మర్రాపు సూర్యనారాయణ, పీవీ అంజనేయులు, జొన్నా శివశంకర్, సాగర్ పాల్గొన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P)

E PROCUREMENT SHORT TENDER NOTICE

NIB No. 07/MAU61-USI0HB(OTH)/44/2023-IFR1 **Dt. 30.06.2023**

Name of Work : "RFP for Engaging Third Party Independent Quality control Agency for Engineering Works in APCRDA".

The bid can be downloaded on AP e-procurement portal from 01.07.2023 to 07.07.2023 up to 15.30 Hrs. Due date for submission of Bid 07.07.2023 up to 16.00 Hrs, Technical bid opening 07.07.2023 @16.30 Hrs. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Chief Engineer (H&B), Vijayawada.

సంపాదకీయం

గాడి తప్పిన తమిళనాడు గవర్నర్

గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి ప్రతినిధులు అన్న మాటకు అభ్యంతరం పెట్టవలసిన అవసరం లేదు. అయితే చాలా మంది గవర్నర్లు ఇటీవలి కాలంలో తాము గవర్నర్లుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకున పెట్టడం కోసం కాచుకుని కూర్చుకున్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మాజీ ఉన్నతాధికారిగా ఉండి ప్రస్తుతం తమిళ నాడు గవర్నర్‌గా ఉన్న ఆర్.ఎన్.రవి మరో రెండాకులు ఎక్కువ చదివినట్టున్నారు. ఏకంగా స్టాలిన్ మంత్రివర్గ సభ్యుడైన సెంతిల్ బాలాజీని గురువారం బర్తరఫ్ చేశారు. అయితే అయిదు గంటలలోగా ఈ బర్తరఫ్‌ను తానే నిలిపివేశారు. రవి అనుసరించిన ఈ వైఖరి రాజ్యాంగ విరుద్ధమైందని చెప్పడానికి పండితులు కావలసిన అవసరంలేదు. ఉద్యోగాలివ్వడానికి డబ్బు తీసుకున్నారన్న ఆరోపణలతో పాటు బాలాజీ మీద అనేక అవినీతి ఆరోపణలున్నాయని, ఆయన మీద ఉన్న నేరపూరిత కేసుల్లో దర్యాప్తు జరుగుతోంది కనక బర్తరఫ్ చేయాలని గవర్నర్ రవి నిర్ణయించేశారు. బాలాజీ మీద ఎన్ని ఆరోపణలైనా ఉండొచ్చు. అవన్నీ ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి కనక ఏ చట్టం దృష్టిలోనూ ఆయనను నేరస్థుడిగా పరిగణించడానికి వీలులేదు. అదీ కాకుండా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు మాట మాత్రమైనా చెప్పకుండా బర్తరఫ్ చేయాలని నిర్ణయించేశారు. వెంటనే ఉత్తర్వు జారీచేశారు. ఏ రాష్ట్ర గవర్నర్ అయినా ఆ రాష్ట్రానికి నామమాత్రమైన అధినేతే. రాష్ట్రపతి, గవర్నర్లు కూడా మంత్రివర్గం సలహా మేరకే నడుచుకోవాలన్న రాజ్యాంగ సూత్రాన్ని రవి ఖాతరు చేయకపోవడం దారుణం. స్వతంత్రంగా పాలనాపరమైన చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రపతికి, గవర్నర్లకు లేదు. అయితే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ విషయంలో న్యాయనిపుణుల అభిప్రాయం తెలుసు కుని ఉండాల్సిందని అనడం వల్ల బర్తరఫ్ ఉత్తర్వును ఆపేశారు. చట్ట ప్రకారం చూస్తే బర్తరఫ్ ఉత్తర్వును నిలిపివేయడమే కాదు సంపూర్ణంగా ఉపసంహరించుకోవాల్సిందే. బర్తరఫ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులోని రెండవ వాక్యమే బాలాజీపై నిరాధార ఆరోపణలతో నిండి ఉంది. ఆయన తన మీద ఉన్న కేసుల దర్యాప్తును అడ్డుకుంటున్నారని గవర్నర్ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఒక వేళ సదరు మంత్రి ఆ పనిచేసి ఉన్నా ఆధారాలు చూపవలసిన కనీస బాధ్యతను కూడా రవి నిర్వర్తించలేదు. ఒక వేళ గవర్నరుకు దగ్గర ఆ మంత్రి దర్యాప్తును అడ్డుకుంటున్నారన్న సమాచారం ఉండి ఉంటే దాన్నీ బయట పెట్టాల్సింది. ఆ పనీ చేయలేదు. తన కార్యాలయానికి అలాంటి సమాచారం అందినట్టు కూడా చెప్పలేదు. నిజానికి విషయం తేలేదాకా ఇవన్నీ బయట పెట్టకుండా ఉండవలసిన అంశాలే. మంత్రి బాలాజీ ప్రస్తుతం ఆయన మీద ఉన్న కేసుల్లో భాగంగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ఆయన మీద మోపిన ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోంది. న్యాయం జరగడమే కాదు జరిగినట్టు కనిపించాలన్న కనీస జాగ్రత్త కూడా గవర్నర్ రవి తీసుకోక పోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ముఖ్యమంత్రి సలహా లేకుండా ఒక మంత్రిని బర్తరఫ్ చేయడం బహుశ: ఇదే మొదటిసారి కావచ్చు. ఇలాంటి ఏకపక్ష, విపరీత చర్యలు రాజ్యాంగ సమ్మతమూ కావు. ఈ కీలకాంశాలను పట్టించుకోకుండా ఆరోపణలున్న మంత్రి బాలాజీ మంత్రివర్గంలో కొన సాగడం అంటే చట్టం పనిచేయడానికి ఆటంకం కలిగించడమేనన్న నిర్ధారణకు గవర్నర్ ఎలా వచ్చారో తెలియదు. బాలాజీ మంత్రివర్గంలో కొనసాగడంవల్ల రాజ్యాంగ యంత్రాంగానికి భంగం కలుగుతుందని కూడా గవర్నర్ నిర్ధారణకు వచ్చేశారు. గవర్నర్ విశ్వాసం చూరగొన్నన్నాళ్లే ఎవరైనా మంత్రివర్గంలో కొనసాగాలి అన్నది రాజ్యాంగ నిర్దేశం. అయితే గవర్నర్ విశ్వాసం చూరగొంటున్నారా లేదా అన్నది గవర్నర్ సొంత అభిప్రాయం మీద ఆధారపడిన విషయం కాదు. గవర్నర్ కేవలం అనుమానం వ్యక్తం చేయలేదు. తాను ఊహించుకున్న అంశాలు సంపూర్ణ సత్యమని నమ్మేశారు. బాలాజీ ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు కనక ఊహా పోహలకు తావు ఉండకూడదు. కేసు తేలేదాకా వేచి ఉండే ఓరిమి గవర్నరుకు లేకుండా పోయింది.

రాజ్యాంగ యంత్రాంగం దెబ్బతినే పరిస్థితి వస్తే రాష్ట్రపతి పాలన విధించవలసి వస్తుందని రాజ్యాంగం గురించి కనీస అవగాహన ఉన్న వారికైనా తెలుస్తుంది. గవర్నర్ స్థానంలోఉన్న వారికి కచ్చితంగా తెలియాలి. లేకపోతే మంత్రి బాలాజీని బర్తరఫ్ చేయడంవల్ల రాజ్యాంగ యంత్రాంగం విఫలం అయ్యే దశను నివారిస్తున్నానని, రాష్ట్రపతి పాలన విధించకుండా చేస్తున్నానని అయినా గవర్నర్ భావించి ఉండాలి. స్వీయ మానసిక ధోరణితో గవర్నర్లు వ్యవహరించడం విపరీత చర్యేకాదు, రాజ్యాంగాన్ని అర్థం చేసుకోకపోవడం. ఆ మాటకు వస్తే రాజ్యాంగాన్ని లెక్కచేయక పోవడమే. గవర్నర్ కేవలం తన ఊహ ఆధారంగా బర్తరఫ్ చేసినట్టే. రాజ్యాంగ యంత్రాంగం విఫలమయ్యే ప్రమాదం ఉందన్నది గవర్నర్ సొంత ఆలోచనలోంచి పుట్టిన అభిప్రాయమే తప్ప చట్టంతోనూ, రాజ్యాంగం తోనూ ఎంతమాత్రం నిమిత్తంలేదు. రాజ్యాంగ యంత్రాంగం విఫలమవు తోందని భావించినా గవర్నర్ తన విచక్షణాధికారాలను వినియోగించే అవకాశంలేదు. రాజ్యాంగ యంత్రాంగం విఫలంఅవుతోంది అన్నది గవర్నర్ సొంత అభిప్రాయం అయితే అదీ చట్టబద్ధమైంది కానే కాదు. గవర్నర్ విచక్షణాధికారాల గురించి సుప్రీంకోర్టులో ఇదివరకే ప్రస్తావనకు వచ్చింది. గవర్నరుకు అలాంటి అభిప్రాయం కలిగితే శాసనసభ సమావేశం ఏర్పాటు చేయించాలి. లేదా సభను ప్రొరోగ్‌చేయాలి. అదికూడా ముఖ్య మంత్రి సలహా మేరకే జరగాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ నిర్ణయం ఏ గవర్నరూ సొంతంగా తీసుకోవడానికి వీలులేదు. మంత్రులను ఏక పక్షంగా బర్తరఫ్‌చేయడం విచక్షణాధికారాల కిందకురాదు. ముఖ్యమంత్రి సలహా ఇస్తేతప్ప ఏ మంత్రినీ గవర్నర్ బర్తరఫ్ చేయకూడదు. అది రాజ్యాంగ నియమం. దేశప్రయోజనాలకు ఏది సబబైంది, ఏది కాదు అన్న విచక్షణాధి కారాన్ని కూడా రాజ్యాంగం ఇవ్వలేదు.

ఒక మంత్రిని బర్తరఫ్ చేయడం అవసరమని గవర్నర్ భావిస్తే ఆ విషయం ముందు రాష్ట్రపతికి నివేదించవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనైనా గవర్నర్ రాజ్యాంగసూత్రాలకు, చట్టాలకు, నిబంధనలకు లోబడి పనిచేయా ల్సిందే. బర్తరఫ్ చేయాలని మొదట నిర్ణయించుకున్నప్పుడు గవర్నర్ రవి నిర్వహించని విధి ఇదే. ఒక మంత్రిమీద తనకు విశ్వాసం లేదని గవర్నర్ భావించినట్టయితే ఆ విషయం ముఖ్యమంత్రికి తెలియజేసి ఆయన సలహా మేరకు నడుచుకోవాలి. ఇవేవీ గవర్నర్ రవికి పట్టిన దాఖలాలు లేవు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా గవర్నర్ నడుచుకోవాలన్న నియమాన్ని ఉల్లంఘించి రవి చాలాదూరం వెళ్లి పోయారు. రాజకీయప్రాపకంవల్ల గవర్నర్లనుంచి ఇంతకన్నా ఏమీ ఆశించలేం.

రాజకీయ ట్యూషన్ సెంటర్

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

"రాయి.. ఒక్కోటీ పదేసి సార్లు రాయి" కుర్చీలో కూర్చున్న ఓ పెద్దాయన తన కాళ్ల దగ్గర కూర్చున్న 17 సంవత్సరాల కుర్రాడ్ని గదమా యిస్తున్నాడు. ఆ కుర్రాడు " మాస్టారు" అని వినయంగా రాయడానికి సిద్ధంగా పెన్ను, రూళ్ల బుక్ తీసుకున్నాడు. "బట్టలూడదీసి తంతా" ఇది మొదటిది...

"నా కొండెల్లారా.... రోడ్డు మీద పరుగులు పెట్టిస్తా" ఇది రెండోది. "తాట తీస్తాను... ఉతికి రోడ్డు మీద ఆరేస్తా" ఇది మూడోది. ఇవన్నీ పదేసిసార్లు తక్కువ కాకుండా రాయాలి. మరో విషయం ఇవన్నీ నువ్వు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడాల్సిన మాటలు" చాలా వివరంగా చెప్పారు పెద్దాయన. మళ్లీ ఆయనే "ముఖ్య విషయం గుర్తెట్టుకో. బహిరంగ సభల్లోను, మీ పార్టీ మీటింగుల్లోను ఇవి వాడాలి. సరేనా"

"అలాగే మాస్టారు. మరి అధికారంలో ఉంటే"... తన సందేహం వ్యక్తం చేసాడు ఆ కుర్రాడు. "అదీ చెప్తాను కంగారు పడకు" "నువ్వు బట్టలూడదీస్తే మేం ఊడదీయ లేమా...." ఇది అధికార పక్షంలో ఉండగా వాడాల్సిన మాట. అలాగే.... "తాట తీయడం, ఉతికి ఆరేయడం మాకూ వచ్చురోయ్" ఇది కూడా పదిసార్లు రాయి" ఇలా చెబుతున్న పెద్దాయన మరోమాట కూడా అన్నారు.

"నువ్వు అధికారంలో ఉన్నప్పుడు నీ దగ్గరికి ఈ విలేకరులు వస్తారు చూడు. అప్పుడు వాళ్లు నిన్ను "ఫలానా ఆయన మిమ్మల్ని ఇలా తిట్టారు. మీ కామెంట్" అని గొట్టాలు మూతి దగ్గర పెడతారు. అప్పుడు కూడా ఏం మాట్లాడాలో చెప్తాను. రాసుకో " అని చాలా నెమ్మదిగా, కుర్రాడికి బాగా అర్థమయ్యేలాచెప్పారు పెద్దాయన. మళ్లీ ఆయనే "ఈ గొట్టాలు ఎక్కువై పోయాయి. ఆళ్లకి తొందరెక్కువ. అందుకని వాటికి దగ్గరగా వెళ్లకు. నీ మీద కోపం ఉన్న ఏ విలేకరో సందులో సందు దొరికిందనుకుని మూతో, ముక్కోపగిలిపోయేలా ఆ గొట్టంతో ఒక్కటిస్తాడు. వెంటనే సారీ సార్ అంటా డనుకో...లోలోపలమాత్రం...బోయినాలకి, గిఫ్టులకి ఆళ్లని పిలుత్తావా... ఈ ముష్టి ఖండనలు, ముండనలు అయితే మేం కావాలా అని తెగ సంబరపడిపోతాడు" అని జాగ్రత్తలు కూడా చెప్పారు.

"అసలు విషయానికి వద్దాం. ఈ విలేకరులు నువ్వు పిలిచినప్పుడో, లేదూ ఆళ్లే వచ్చినప్పుడో ఇలా మాట్లాడాలి. ఇది కూడా రాసుకో..." అన్నారు. "ఆడా ముసలాడైపోయాడు. రేపో, మాపో అన్నట్లు ఉన్నాడు. ఇక ఆడి కొడుకు" అని ఆపారు పెద్దాయన. "గురువుగారు ఎందుకాపారు" అని వినయంగా అడిగాడు కుర్రాడు కమ్ శిష్యుడు.

"ఆడికొడుకు అని తిట్టేప్పుడు అది ఏ సీజనో గుర్తెట్టుకుని ఆ కాలంలో వచ్చే కూరగాయలతో తిట్టాలి. అంటే ఆడో మామిడికాయ పప్పు. లేదు టమాటా పప్పు. ఆనపకాయ పప్పు అనాలన్నమాట".

అరగంట నుంచి జరుగుతున్న ఈ గురుశిష్యుల సంభాషణలని కాసింత దూరంగా స్తంభానికి ఆనుకుని చేతులు కట్టుకుని వింటున్న ఓ 50 ఏళ్ల పెద్ద మనిషి వీరిద్దరి దగ్గరికి వచ్చాడు. అరమోడ్పు కన్నులతో, ఒకటిన్నర ఆనందభాష్పం నేల రాలుతుండగా గురువు గారికి రెండు చేతులతోను దండం పెట్టి "మా అబ్బాయి నా వారసుడిగా రాజకీయ ప్రవేశం చేస్తున్న సమయంలో మీలాంటి గురువు దక్కడం నిజంగా నా అదృష్టం. మా నాన్న చేతగాని వాడు. అందుకే నాకోసం ఏ గురువును పెట్టలేదు. ఆయన సర్పంచ్‌గా మరణించాడు. నేను ఎమ్మెల్యేగా కాలం చేస్తాను. నా కొడుకు మాత్రం మీ శిక్షణలో రాటుదేలి కచ్చితంగా మంత్రి అవుతాడు" అన్నాడు. "ఏదో మీ అభిమానం. అయినా...ఈ మాత్రాని కేనా... ఇంకా చాలా ఉన్నాయి. వాటన్నింటిని ఔపోసన పట్టించేయను. వచ్చే ఏడాదికి మీవాడికి ఓటు హక్కు....దాని తర్వాత ఆపై ఏడాది వచ్చే ఎన్నికల్లో విజయం, మంత్రి పదవి వచ్చేలా చేయడమే నా లక్ష్యం" అన్నారు. తర్వాత మళ్లీ ఆ గురువుగారే... "మీరు వెళ్తే మిగిలినవి కూడా చెప్తాను. మీరుంటే పిల్లాడు సిగ్గుపడతాడు నే చెప్పే మాటలకి" అన్నాడు.

గురువుగారి మాటకి అడ్డొచ్చిన ఎమ్మెల్యేగారు గురువు గారి చెవి దగ్గర తన మూతిని పెట్టి "వీడు సిగ్గుపడడం కాదండి మాస్టారు. వీడికి ఓటేసిన వాళ్ల సిగ్గు పడేలా వీడిని తయారు చేయాలి" అని గుసగుసలాడారు.

"మీ నాన్నగారికి నేనంటే వల్లమాలిన గౌరవం. సరే, ఇప్పుడు హోం వర్క్ ఇస్తా. అది రాసుకుని బట్టీ పట్టు. ఈ సూత్రాలు చాలా ఉపయోగపడతాయి" అన్నారు గురువుగారు. "చెప్పండి మాస్టారు" అని రాసుకుందుకు హుషారుగా సిద్ధమయ్యాడు శిష్యుడు.

"ముందుగా నువ్వు వేసుకున్నవి కాకుండా అథమపక్షం మూడు జతల చెప్పుల జతలు నీ బ్యాగులో ఉండాలి...."

ఇక రెండోది.... మరీ ముఖ్యంగా... నువ్వు చాలా పెద్ద నాయకుడివి అయ్యాక చేయాల్సింది.... విలేకరుల సమావేశంలో ఎక్కిళ్లతో... మాట వినపడకుండా ఏడవాలి" "ఏడుపు రాకపోతే ఎలా గురువుగారు" అమాయకంగా అడిగాడు శిష్యుడు.

"Good Question .... అప్పుడేం చేయాలంటే... నువ్వు గెలిస్తే వచ్చే మంత్రి పదవో, ముఖ్యమంత్రి పీఠాన్నో గుర్తు చేసుకో. అంతే వెంటనే ఏడుపొచ్చేస్తుంది" అన్నారు గురువు గారు.

ఇంకో కిటుకుందోయ్....ఉత్తరాంధ్రలో ఓమంత్రిగారు ఉపయోగిస్తారు. నేను నేర్పుతాను. నువ్వు పెద్దాడివి అయ్యేప్పటికి ఆయన రిటైర్ అవుతాడు. ఆయన దగ్గరికి వెళ్లి కాళ్ల మీద పడి నేర్చుకో" అంటూ...

చాలా పెద్ద స్కామో....ప్రశ్నాపత్రాలు లీకవడమో వంటివి జరిగితే ఆయన ఇలాంటివే చేస్తాడు" అన్నారు. "ఏం చేస్తారు సారు ఆయన" ఉత్సాహంగా అడిగాడు. అంటే మైకులముందు నుల్చుని "ఉఉఉఉఉఉ.... ఆఆఆఆఆ... ఈఈఈఈఈ...అది. నమస్కారం" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోవాలి. "ఈ ఆఖరిది మాత్రం సూపర్ గురువుగారు" అంటూ పొగిడాడు శిష్యుడు. "అన్నట్లు...ఇంకెవరైనా నీలాంటి కుర్రాళ్లు రాజకీయా ల్లోకి వస్తారేమో కనుక్కో...నాలుగుబూతులు వాళ్లకీ నేర్పుతా...నాలుగురాళ్లు వెనకేసుకుంటా" అంటూ పంచె పైకి లాక్కుంటూ కుర్చీలోంచి లేచి లాల్చీ జేబుల్లో రెండు చేతులు పెట్టుకుని అలా నడుచుకుంటూ వెళ్లిపోయారు పెద్దాయన.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

మోదీని భయపెడ్తున్న రాహుల్ బూచి

ప్రాకృతిక సౌందర్యం దృష్ట్యా రీత్యా మణిపూర్ చాలా అందమైన ప్రదేశం. కాని ఆ రాష్ట్రంలో మే మూడవ తేదీనుంచి నిరాఘాటంగా హింస తాండవమాడుతోంది. లక్షలాది మంది తమ ఇల్లు, వాకిలి వదిలేసి నిరాశ్రయులై శరణార్థుల శిబిరంలో తల దాచుకుంటున్నారు. తమను, తమ కుటుంబాలు రక్షించుకోవడానికి నానా యాతన పడవలసి వస్తోంది. అయినా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మౌనవ్రతంలో ఉంది. ప్రభుత్వం బలహీనంగా తయారైనప్పుడు సహజంగానే కళ్లు, చెవులు, నోరు మూసుకుని గాంధీజీ మూడు కోతుల్లా వ్యవహరిస్తుంది. కానీ ఎన్నికలే సర్వస్వంగా భావించే బీజేపీ ప్రభుత్వం రాబోయే ఎన్నికల మీదే దృష్టి సారించింది.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పుడే బిహార్‌లో ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నారు. బీజేపీ అధ్యక్షుడు నడ్డా రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉన్నారు. తమ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించే పనిలో పడిపోయారు. కోటిన్నర ఇళ్లకు కుళాయిల ద్వారా మంచి నీరు అందిస్తున్నామని ప్రచారం చేస్తున్నారు. నిజానికి అది ప్రపంచ బ్యాంకు నిధులతో అమలయ్యే పథకం. అస్తుబిస్తుగా తయారైన ప్రజలను ఎవరైనా పరామర్శిస్తే, గాయపడిన మనసులకు ఊరట కలిగిస్తే కేంద్ర ప్రభుత్వాన్ని భయమే పీడిస్తోంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గురువారం మణిపూర్‌లో రెండు రోజుల పర్యటనకు వెళ్లారు. జనం గుండెలకు తగిలిన గాయాలను మాపే ప్రయత్నం చేశారు. ఇంఫాల్ లో విమానందిగి బాధితుల కుటుంబాలతో మాట్లాడడానికి ప్రయత్నించినప్పుడు ఇంఫాల్ విమానాశ్రయానికి దాదాపు ఇరవై కిలోమీటర్ల మేర కారులో ప్రయాణించగానే పోలీసులు ఆయన వాహన శ్రేణిని ఆపేశారు.

మణిపూర్ మండిపోతున్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యా తీసుకోలే దన్నది అసలు ప్రశ్న. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఒకే పార్టీ అంటే బీజేపీ ప్రభుత్వమే ఉంటే అంతా సవ్యంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం పదే పదే చెప్తూ ఉంటుంది. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ఉండడం ఇది రెండవసారి. మోదీ భాషలో చెప్పాలంటే అక్కడ డబుల్ ఇంజన్ ప్రభుత్వమే ఉంది. అయినా 1949 నుంచి ఎప్పుడూలేని అల్లకల్లోలం మణిపూర్‌లో రాజ్యమేలుతోంది. రాహుల్ గాంధీ ఆ రాష్ట్రంలోని బాధితులను పరామర్శించాలనుకోవడంలోనే మోదీ ప్రభుత్వం వెన్నులో ఒణుకు మొదలైంది. రాహుల్ గాంధీ ఎక్కడికి వెళ్లినా ప్రజలతో సంభాషిస్తారు. తొమ్మిదేళ్ల మోదీ పాలన ప్రశ్నలను మాత్రమే మిగిల్చింది. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పడం మోదీ ప్రభుత్వానికి అసాధ్యం అయిపోయింది.

గత రెండు నెలలుగా మణిపూర్‌లోని పన్నెండు జిల్లాలు కుమ్మరి ఆవంలా తయారయ్యాయి. దాదాపు 20 మందిరాలు, 250 చర్చీలు భస్మీ పటలం అయిపోయాయి. గిరిజనుల జీవనం దుర్భరమైంది. ఆదివాసులు కాని మెయితీలు తమను ఆదివాసుల్లో చేర్చాలని పట్టుబడుతున్నారు. ఈ డిమాండు వెనక ఉగ్రవాదమూ దాగి ఉంది. ఆయుధాలను ఇష్టానుసారం లూటీ చేస్తున్నారు. ఈ పరిస్థితిని చక్క దిద్దడానికి కేంద్రం ఎలాంటి ప్రయత్నం చేయడంలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 131 మంది ఈ హింసాకాండలో ప్రాణాలు కోల్పోయారు. 65,000 మంది ప్రజలు నిర్వాసితులయ్యారని ప్రభుత్వ గణాంకాలే రుజువు చేస్తున్నాయి. అయిదు వేల హింసాత్మక సంఘటనలు జరిగాయి. 144 మందిని అరెస్టు చేశారు. అంతర్జాలం నిలిపేశారు. పాఠశాలలు, కళాశాలలు మూసేశారు. అక్కడ సైన్యాన్ని నియోగించవలసి వచ్చింది. 36,000 సాయుధ బలగాలను దింపినట్టు ప్రభుత్వమే ఒప్పుకుంటోంది. ఈ పరిస్థితిలో ప్రజల బాగోగులు తెలుసుకోవ డానికి, వారి గాయాలను మాపడానికి రాహుల్ ప్రయత్నిస్తే రోడ్డు మార్గంలో వెళ్లడానికి వీలులేదని ప్రభుత్వం అడ్డు తగిలింది. వెళ్లాలనుకుంటే హెలీ కాప్టర్‌లో వెళ్లాలని సలహా పడేసింది. కొద్ది రోజుల ముందు కేంద్ర హోం మంత్రి మణిపూర్‌లో పర్యటించినప్పుడు అక్కడ హెలికాప్టర్ సదుపాయం కల్పించారు.

రాహుల్ గాంధీ ఇప్పుడు లోకసభ సభ్యులు కారు. పరువు నష్టం దావా కేసులో ఆయన లోకసభ సభ్యత్వం రద్దయిన తరవాత ఆయన అధికార నివాసాన్ని ఖాళీ చేయించారు. ఆయన లోకసభలో మాట్లాడే అవకాశం లేకుండా చేశారు. పరువు నష్టం కేసులో విధించదగిన అత్యధికంగా రెండేళ్ల జైలు శిక్ష విధించారు. కానీ రాహుల్ గాంధీని జైలుకు పంపించే ధైర్యం కూడా మోదీ ప్రభుత్వానికి లేదు. రాహుల్‌ను జైలులో పెడ్తే తమ కాళ్ల కింది రాజకీయం నేల జారి పోతుందని ప్రభుత్వానికి తెలుసు. ఆయనను జైలులో పెట్టినా సమస్యే. ఇప్పుడు రాహుల్ ఏ బాదరబందీ లేని వ్యక్తి కనక ఆయన ఎక్కడెక్కడ పర్యటించి ఏం విమర్శలు గుప్పిస్తారోనన్న భయం కేంద్ర ప్రభుత్వాన్ని పీడిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యిలా తయారైంది. ఆయన వెళ్లిన చోటల్లా జనంతో మాట్లాడతారు కనక అది మోదీ ప్రభుత్వాన్ని సంకట స్థితిలో పడేస్తుంది. రాహుల్ వెళ్లాల్సిన చోట మహిళలు గుమి కూడారు కనక రాహుల్ వెళ్లడం సురక్షితం కాదని చెప్పారు. నిజానికి ఆ మహిళలు రాహుల్ గాంధీ పర్యటనను అడ్డుకోవడానికి గుమి కూడలేదు. రాహుల్‌కు తమ గోడు వినిపించుకోవాలనుకున్నారు. కానీ మోదీ ప్రభుత్వం భద్రత ముసుగు తొడిగింది. మేమున్న శరణార్థుల శిబిరానికి వచ్చి తమ దయనీయ పరిస్థితులను రాహుల్ తెలుసుకోవాలని ఆ మహిళలు కళ్ల నీళ్ల పర్యంతమై ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చురాచాంద్‌పూర్ వెళ్లాలనుకున్నారు. అక్కడ శరణార్థుల శిబిరాలున్నాయి. ఏ ప్రాంతంలోనైతే విపరీతమైన గృహదహనాలు జరిగాయో, విచ్చలవిడిగా విధ్వంసం జరిగిందో అక్కడ పరిస్థితిని రాహుల్ తెలుసుకోవాలని ఆ మహిళలు కోరుకున్నారు. మహిళలపై బాష్పవాయువు గోళాలు ప్రయోగించి పుండు మీద కారం చల్లారు. రాహుల్ గాంధీ హెలీకాప్టర్ నుంచి కొన్ని ప్రాంతాలను సందర్శించినప్పుడు మహిళల్లో రోదన పెల్లుబికింది. మొట్టమొదటి సారి రాహుల్ లాంటి వ్యక్తి దిల్లీ నుంచి వచ్చి తమను కలుసుకోవాలనుకోవడంవల్ల ఊరట కలుగుతుందని మహిళలు ఆశించారు.

మణిపూర్‌లో జనజీవితం ఎంత దుర్భరం అయిందంటే బియ్యం ధర రెండు రెట్లయింది. బంగాళా దుంపల ధర నాలుగు రెట్లు పెరిగింది. ఎ.టి.ఎం.ల ఎదుట జనం బారులు తీరుతున్నారు. కానీ అంతలోనే ఎ.టి.ఎం.ల నుంచి డబ్బులు రాలడం లేదు. ఈ దశలో అక్కడ పరిస్థితిని మెరుగు పరచేది ఎవరు అన్నది పెద్ద ప్రశ్న. మరి మణిపూర్ జనం కష్టాలు దేశవాసులకు తెలియడం ఎలా? 65,000 మంది నిర్వాసితులయ్యారని ప్రభుత్వం చెప్తున్నా ఆ సంఖ్య కనీసం లక్షన్నర ఉంది. కొంత మంది అస్సాం, మేఘాలయ, కడకు బెంగాల్ దాకా తరలి పోవాల్సి వచ్చింది. మణిపూర్‌లో హింస చెలరేగినప్పుడు కర్నాటకలో ఎన్నికల సాకు చూపారు. అమిత్ షా మణిపూర్ వెళ్లిన మాట నిజమే అయినా ఆయన వ్యవహారం అంతా టెలిఫోన్ ద్వారానే నడిపించారు. ఆయన జనాన్ని కలుసుకోలేదు. కేవలం అధికారులతో సమీక్షించి వెనుదిరిగారు. పాలనా వ్యవస్థను చక్క దిద్దాల్సిన వాస్తవాన్ని అంగీకరించాలసిందే కానీ అమిత్‌షా జనం గోడు వినవే లేదు. దీనికి విరుద్ధంగా రాహుల్ నేరుగా ప్రజలను కలుసుకోవాలని సంకల్పించడం మోదీ సర్కారును దిక్కు తోచని స్థితిలో పడిపోయింది. చర్చీలను ధ్వంసం చేయడం అక్కడ మతకలహాలు పెచ్చరిల్లాయనడానికి నిదర్శనం. హిందువులైన మెయితీలు బీజేపీని సమర్థిస్తున్నారు. గిరిజనుల్లో ఎక్కువ మంది క్రైస్తవులు. మెయితీలు తమను కూడా గిరిజనులుగా పరిగణించాలని వితండవాదానికి దిగారు. అప్పుడు మెయితీలు గిరిజన ప్రాంతాల్లో భూములు గుత్తా కొనుక్కోవచ్చు. ఇది గిరిజనుల జీవన విధానాన్ని సమూలంగా మార్చేస్తుంది. మణిపూర్ శాసనసభలో మొత్తం 60 మంది సభ్యులుంటే అందులో 40 మంది మెయితీలే. ఇంతవరకు 12 మంది ముఖ్యమంత్రులైతే అందులో పదిమంది మెయితీలే. రాజకీయ పరిస్థితిని తమను సమర్థిస్తున్న మెయితీలకు అనుగుణంగా మార్చాలన్నది బీజేపీ పన్నాగం. తమ పరిపాలన విఫలం అయిన చోట ప్రతిపక్షాలు కాలు మోపడానికి అవకాశం దక్కితే తమ బండారం బయట పడ్తుందన్న భయం బీజేపీని పీడిస్తోంది. అదే జరిగితే 2024లో బీజేపీ చేతిలోంచి అధికారం జారిపోవడం ఖాయం. రాహుల్ ఇప్పుడు స్వేచ్ఛా జీవి కనక ఏ సమస్యనైనా లేవనెత్తవచ్చు. ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టవచ్చు. మణిపూర్‌లో ప్రజలను పరామర్శించడంతో పాటు పౌరసమాజంలోని వారిని, సీనియర్ పౌరులను కలుసుకోవాలనుకున్నారు. దీనివల్ల మోదీ ప్రభుత్వం నిష్క్రియాపరత్వం బట్టబయలు అవుతుంది. అదీ మోదీ సర్కారు అసలు భయం.

మణిపూర్ వ్యవహారంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటైనా ఒరిగింది ఏమీ లేదు. జనం సంవేదనలను పట్టించుకోకుండా ప్రభుత్వం కళ్లు మూసుకుంది. ప్రజల ఇబ్బందులను విస్మరించే ప్రభుత్వం మాట్లాడలేకపోవడమూ సహజమే. రాజకీయంగా తమకు సంపూర్ణ ఆధిపత్యం ఉన్న మణిపూర్‌లో 1949 నుంచి ఇప్పటి దాకా తలెత్తని సంకటస్థితికి ఇప్పుడే ఉబికి రావడానికి కారణం తమ దుష్పరిపాలనే అని బీజేపీ చెప్పుకోలేదుగా! పరిస్థితి ఇంత విషమంగా ఉన్నా మోదీ పెదవి విప్పక పోవడం ఆయన బలహీనతే ప్రధాన కారణం. ప్రజల జీవనానికే ముప్పు ఏర్పడినస్థితిలో కూడా న్యాయవ్యవస్థ పరిస్థితిని చక్కదిద్దాలని ప్రభుత్వాన్ని ఆదేశించకపోవడం ఇంకా విచిత్రం. జీవించేహక్కుతో పాటు మణిపూర్ ప్రజల సకల ప్రాథమికహక్కులకు భంగం కలుగుతున్నప్పుడు సైతం మోదీ పెదవి విప్పకపోవడం కన్నా సిగ్గు చేటు ఏముంటుంది. బీజేపీ రేపుతున్న మంటలను చల్లార్చాలని ప్రజలుతలిస్తే మోదీ చేతిలోనిఅధికారం జారిపోవచ్చు.

-ఆర్వీ రామారావ్

దౌత్య స్వయంప్రతిపత్తికి మోదీ మంగళం

పి.సుధీర్

ఇటీవల మోదీ అమెరికాలో పర్యటించి భారతదేశ దౌత్య స్వయం ప్రతిపత్తికి మంగళం పాడారు. అమెరికాతో వ్యూహాత్మక సైనిక సంబంధాలను మరింత పటిష్టం చేశారు. రెండూ ప్రజాస్వామ్య దేశాలని అందువల్లనే భాగస్వామ్యం మరింత గట్టిపడుతుందని పదేపదే చెప్పారు. రెండు దేశాలు ఒకేవిధమైన విలువలు కలిగి ఉన్నాయని అన్నారు. అమెరికా భారతదేశంతో గట్టి బంధం ఏర్పరచుకునేందుకు ప్రధాన కారణం ఒకటి ఉంది. ఆర్థికంగా, సైనికంగా చైనాను అదుపు చేయలేని అమెరికా భారతదేశంతో బంధం ఏర్పరచుకుని చైనాను గట్టిగా ఎదుర్కోవాలన్నదే అమెరికా లక్ష్యం. అంతేకాదు రెండు దేశాల్లో 2024లో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూడా మోదీని బైడెన్ ప్రశంసలతో ముంచెత్తారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయుల ఓట్లు బైడెన్‌కి ఎంతైనా అవసరం. 2024లో మళ్లీ గెలిచి అధ్యక్ష స్థానాన్ని అందుకోవాలనేది అక్కడ బైడెన్, భారతదేశంలో ప్రధాని పదవికి మోదీ తహతహలాడుతున్నారు.

2002లో పెంటగాన్ ప్రారంభించిన అధ్యయన పత్రంలో అమెరికా లక్ష్యం స్పష్టం చేస్తున్నది. చైనాతో భారతదేశాన్ని సమ ఉజ్జీగా నిలిపి తమ లక్ష్యాన్ని సాధించుకోవాలని అమెరికా తలపెట్టింది. ఆ లక్ష్యం సాధించడంకోసమే భారతదేశాన్ని తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో బైడెన్ ఉన్నారు. అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో రెండవసారి మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. ప్రభుత్వం తరఫున విందు ఏర్పాటు చేశారు. చైనా అభివృద్ధిని నిలువరించేందుకు ఆ దేశాన్ని ఏకాకిని చేసేందుకు అమెరికా చేసిన కృషి ఫలించలేదు. తాను అనుకున్న ఫలితాలను సాధించడానికి భారతదేశాన్ని ఉపయోగించుకోనున్నట్లు అమెరికాలో మోదీ పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయడానికిగాను అమెరికా భద్రత సలహాదారు జాక్ సల్లెవాన్ భారతదేశంలో పర్యటించిన అనంతరం సంయుక్త ప్రకటనలు విడుదల చేశారు. అందులో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారతదేశం కీలకపాత్ర నిర్వహిస్తుందనేది కీలక సమాచారం. చైనాకు, భారతదేశానికి మధ్య మంచి సంబంధాలు లేవు. ఈ పరిస్థితుల నేపథ్యంలో భారతదేశాన్ని చైనాతో ఢీకొనేందుకు ముందుకు నెడుతోంది. భారత-అమెరికా సంయుక్త ప్రకటనలో క్వాడ్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ప్రకటన మొదటి పేరాలోనే ఈ అంశాన్ని వివరించారు. రక్షణ పరికరాల ఉత్పత్తిలో సహకారం, ఉన్నత సాంకేతికతను పరస్పరం పంపిణీ చేసుకునేందుకు, క్వాడ్‌ను భద్రతా సంఘటనగా మార్చుకునేందుకు కృషి చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యూహాత్మక సంఘటనలలోకి భారతదేశాన్ని చేర్చుకునేందుకు ముందుగానే అంటే 2005లోనే పౌర అణుఒప్పందాన్ని అమెరికా ప్రతిపాదించింది. పౌర అణు సాంకేతికతను భారత్‌కు ఎరవేసింది. ఇందులో ఇచ్చిపుచ్చుకునే అంశం ఇమిడిఉంది. రక్షణ చట్రం ఒప్పందంగా దీన్ని భావించాలి. అణుఒప్పందానికి ముందు చర్యగా 2005 జూన్‌లో రెండు దేశాలమధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. రక్షణచట్ర ఒప్పందం ఇరువురు కలిసి కార్యకలాపాలు నిర్వహించే ఒప్పందాలను, వివిధ లాజిస్టిక్‌ల అమలును ఆనాడే వామపక్షాలు గట్టిగా వ్యతిరేకించాయి. అందువల్ల గత కొన్ని సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం నాలుగు మౌలిక ఒప్పందాలుగా చెప్పుకుంటున్న వాటిపై ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

సైనిక బాంధవ్యం పురోగమిస్తున్నదని సంయుక్త ప్రకటన తెలిపింది. ఈ బాంధవ్యంలో సంయుక్త సైనిక విన్యాసాలు, భారత నౌకాశ్రయాలలో అమెరికా నౌకల నిర్వహణ, మరమ్మత్తులకు హబ్‌గా ఏర్పాటు చేయడం, రెండు దేశాల సైనిక సంస్థల మధ్య సంబంధాలకు మధ్యవర్తిత్వ అధికారుల నియామకం, రెండు దేశాల సైనికదళాల నిర్వహణలోభాగం పంచుకోవడం లాంటి అంశాలు సంయుక్త ప్రకటనలో ఉన్నాయి. అన్ని అంశాలకు సంబంధించిన వ్యవహారాలు భారత్-అమెరికా సైనిక సంబంధాలలో ఇమిడి ఉంటాయని చెప్పేందుకు అమెరికా వ్యూహాత్మక నిపుణుడు దీన్ని ఒకరకమైన సంఘటన అని పిలిచారు. నాటో ఒప్పందంలోని ఆర్టికల్ 5 క్లాజ్ ప్రకారం, ఒక దేశంపై

దాడిని మరో దేశం తనపైదాడిగా పరిగణించి పరస్పరం సహకరించుకోవాలి. ఉన్నత సాంకేతికతలో సహకారం గురించి రకరకాల వాగ్దానాలు ఉన్నాయి. సంయుక్త ప్రకటనలో "సాంకేతికత మన భాగస్వామ్యం ప్రగాఢమైందన్న నిర్వచనాన్ని తెలియజేస్తుందని" పేర్కొన్నారు. అంతరిక్ష సాంకేతికత నుండి క్వాంటమ్ పరిశోధన, సంక్లిష్టమైన ఖనిజాలు, కృత్రిమ మేథస్సులాంటి వాటిపై సంయుక్త పరిశోధన, భాగస్వామ్యం ఉంటాయని ఆ ప్రకటన పేర్కొంది. అయితే ఈ ప్రకటన వెనుక కావాలని చేసుకున్న ఉద్దేశం కనిపిస్తోంది. రక్షణరంగ పరికరాల ఉత్పత్తిలో సహకారం, జనరల్ ఎలక్ట్రిక్, హిందుస్థాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ మధ్య ఎఫ్-414 జెట్ ఇంజన్ల తయారీలో సహ ఉత్పత్తిదారుల, లైట్ కంపాక్ట్ ఎయిర్ క్రాఫ్ట్ ఎమ్‌కె 2 ఉత్పత్తిలో సహకారం ఉంటాయని ఒప్పందంలో పేర్కొన్నారు. అయితే అమెరికా జెట్ ఇంజిన్ సాంకేతికతకు సంబంధించిన వ్యవహారంలో తప్పుదారి పట్టించేదిగా కనిపిస్తోంది.

భారతదేశంతో గట్టి బంధం ఏర్పరచుకోవడంలో అమెరికాకు రెండు లక్ష్యాలున్నాయి. రష్యా నుంచి రక్షణ పరికరాలను దిగుమతి చేసుకుంటున్న భారత్‌ను రష్యాకు దూరం చేయడం, తానే నేరుగా ఆయుధాలను ఎక్కువగా భారత దేశానికి విక్రయించడం. రక్షణ, పారిశ్రామిక, సహకార ఒప్పందంలో పరస్పర కార్యకలాపాల నిర్వహణ, క్వాడ్‌లో భారత సైన్యం పాత్ర మరింత పెంచడం, అలాగే హిందూ మహా సముద్ర ప్రాంతంలో సైనిక కార్యకలాపాల నిర్వహణ పెంచడంకూడా అమెరికా లక్ష్యం. అందుకోసమే అమెరికా భారతదేశాన్ని ఎమ్‌క్యు-9బి గార్డియన్ ఆయుధ డ్రోన్‌లను మూడు బిలియన్ డాలర్ల వ్యయంచేసి కొనుగోళ్లు చేయవలసిందిగా అమెరికా వత్తిడిచేసింది. ఈ ప్రిడేటర్‌డ్రోన్లు చాలాఖరీదైనవి. ఇవి నూతనతరం డ్రోన్లకంటే చాలా నెమ్మదిగా కదులుతాయి. చాలామంది నిపుణులు పాత డ్రోన్లను అమెరికా భారత్‌కు కట్టబెడుతుందని అన్నారు. ఈ డ్రోన్ల ద్వారా భారతదేశం నిఘాను పెట్టాలని ఇంటెలిజన్స్ విభాగం ద్వారా సమాచారాన్ని సేకరించాలని హిందూ మహా సముద్ర ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహించాలని అమెరికా కోరుతోంది. ద్వైపాక్షిక, ఆర్థిక,వాణిజ్య ఒప్పందాలను మరింత ప్రగాఢం చేసుకోవాలని అమెరికా మాట్లాడుతోంది. అయితే చివరికి వాణిజ్యఒప్పందాల చట్టాన్ని భారత దేశానికి వర్తింపచేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ అమెరికా అంగీకరించలేదు. అయితే మనదేశంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే కార్యకలాపాలను, మతమైనారిటీల హక్కులను తిరస్కరించడం, మానవహక్కుల ఉల్లంఘన తదితర అంశాలను బైడెన్ ప్రస్తావించకుండా వదిలేశారు. అంటే తమ పనులు సాధించుకోవడానికి మాత్రమే అమెరికా ఎల్లవేళలా ప్రాధాన్యత ఇస్తోంది.

మంత్రుల నియామకాధికారం ముఖ్యమంత్రిదే

గవర్నర్ చర్యలను తిరస్కరిస్తున్నాం

బాలాజీ తొలగింపుపై డీఎంకే

చెన్నై: మంత్రులను నియమించడానికి, తొలగించడానికి ముఖ్యమంత్రికి విశేషాధికారం ఉంటుందేగానీ గవర్నర్‌కు కాదని తమిళనాడులోని అధికార డీఎంకే స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి స్టాలిన్ మంత్రిమండలి నుంచి వి.సెంథిల్ బాలాజీని తొలగిస్తూ గవర్నర్ ఆర్ఎస్ రవి ఆదేశాలివ్వడాన్ని వ్యతిరేకించింది. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సమగ్రంగా లేఖను గవర్నర్‌కు రాస్తారని రాష్ట్ర ఆర్థికమంత్రి థంగం థెన్నరసు తెలిపారు. గవర్నర్ చర్యలకు సంబంధించి తమకు చట్టపరంగా ఉన్న అన్ని అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచన మేరకే మంత్రి బాలాజీని తొలగించే ఉత్తర్వులను గవర్నర్ రవి వెనక్కి తీసుకున్నారు. ఈ మేరకు సీఎం స్టాలిన్‌కు రెండు లేఖల్లో స్పష్టతిచ్చారు. మంత్రి బాలాజీని మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేయగా ఆయన జైలులో ఉండటంతో గవర్నర్ గురువారం ఏకపక్షంగా బాలాజీని మంత్రిమండలి నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే అంశమై శుక్రవారం న్యాయ మంత్రి ఎస్. రఘుపతి, రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్‌తో కలిసి మంత్రి థంగం విలేకరులతో మాట్లాడుతూ గవర్నర్ నిర్ణయాన్ని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. బాలాజీపై వేటు వేసే అధికారం గవర్నర్‌కు లేదని స్టాలిన్ ఇంతముందే స్పష్టంచేశారని, ఈ వ్యవహారంలో న్యాయపరంగా ముందుకెళతామని చెప్పారని థెన్నరసు అన్నారు. బాలాజీ విషయంలో గవర్నర్ ఏకపక్షంగా వ్యవహరించడమే కాకుండా తొందరపడ్డారని, ఎవరిని సంప్రదించకుండా ఆయనను తొలగించారని, కేంద్ర హోంశాఖ కూడా దీనిని ప్రశ్నించిందని, అటార్నీ జనరల్‌తో మాట్లాడాల్సిందని హితవు పలికిందని చెప్పారు. తాజా వ్యవహారంలో గవర్నర్‌కు పూర్తి వివరాలతో లేఖను సీఎం స్టాలిన్ పంపుతారని చెప్పారు. బాలాజీని తొలగించేందుకు చట్టబద్ధంగా లేక రాజ్యాంబద్ధంగా గవర్నర్‌కు అధికారం లేదన్నారు. మంత్రుల నియామకం, తొలగింపు అధికారం ముఖ్యమంత్రి సొంతమని నొక్కిచెప్పారు. గవర్నర్ రవి తొందరపాటు చర్యను ప్రభుత్వం పూర్తిస్థాయిలో తిరస్కరిస్తోందన్నారు. గవర్నర్ లేఖలనూ తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. న్యాయపరంగా ఉన్న అవకాశాలను పరిశీలించిన తర్వాత భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని మంత్రి అన్నారు. ఈ విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలన్నది పార్టీ నాయకులు, ఆఫీసు బేరర్లతో (న్యాయ, రాజకీయ) చర్చించిన తర్వాత అధిష్ఠానం నిర్ణయిస్తుందని డీఎంకే వర్గాలు తెలిపాయి. డీఎంకేను లక్ష్యంగా చేసుకోవడం కోసం బీజేపీ రాజకీయపరంగా చేసిన ఒత్తిళ్లకు గవర్నర్ తలొగ్గారని వ్యాఖ్యానించాయి.

తమిళనాడు గవర్నరును తొలగించాల్సిందే

దీపాంకర్ భట్టాచార్య డిమాండ్

పాట్నా: తన పరిధిని అతిక్రమించిన తమిళనాడు గవర్నరు ఆర్ఎన్ రవిని తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ డిమాండ్ చేసింది. మంత్రి సెంథిల్ బాలాజీని గవర్నరు బర్తరఫ్ చేయడం ఊహించని పరిణామమని పేర్కొంది. మంత్రి బాలాజీని హడావుడిగా బర్తరఫ్ చేయడం, తర్వాత ఆ దేశాలను నిలిపివేయడం వంటి చర్యలు గురువారం వెంటవెంటనే జరిగాయి. మంత్రి బాలాజీ బర్తరఫ్ ఆదేశాలను గవర్నరు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు సమాచారం ఇచ్చారు. గవర్నర్ రవి తొందరపాటు చర్యపై సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య శుక్రవారం ఇక్కడ పీటీఐతో మాట్లాడుతూ తీవ్రంగా స్పందించారు. 'రవి తరచూ తన పరిధిని అతిక్రమిస్తున్నారు. గవర్నరు పదవిని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారం వ్యవరిస్తున్నారు' అని భట్టాచార్య విమర్శించారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చే ధైర్యంతోనే గవర్నరు తనకు తోచిన నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. బీజేపీ యేతర ప్రభుత్వాలను శత్రువులుగా మోదీ సర్కారు పరిగణిస్తోందని ఆరోపించారు. జమ్ముకశ్మీరును విభజించి...కేంద్ర పాలిత ప్రాంతం చేయడం నుంచి దిల్లీలో అధికారాలు తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ఆర్డినెన్స్ తీసుకురావడం, తమిళనాడు వ్యవహారం వరకు రాజ్యాంగంపై మోదీ సర్కారు యుద్ధమే చేస్తోందని భట్టాచార్య వ్యాఖ్యానించారు. సమాఖ్య విధానానికి తూట్లు పొడుస్తోందని చెప్పారు. ఎన్‌డీఏ దుష్టపాలన కారణంగా దేశం సంక్షోభంలో కూరుకుపోతోందని, అందువల్ల రాజ్యాంగాన్ని, లౌకిక, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం ఫాసిస్టు శక్తులపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. దేశ స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని, సమాఖ్య నిర్మాణాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు.

వాళ్లిద్దరినీ ఆడిపోసుకోవడమే బీజేపీ పని: సుప్రియా సూలే

ముంబై: తన తండ్రి, సోదరుని చుట్టూ కేంద్ర, రాష్ట్ర రాజకీయాలు సాగుతుంటాయని, బీజేపీకి వారిద్దరినీ ఆడిపోసుకోవడం తప్ప వేరే పనిలేదని ఎన్సీపీ కార్యనిర్వాహక అధ్యక్షులు సుప్రియా సూలే వ్యాఖ్యానించారు. ఎన్సీపీ అధినేత, తండ్రి శరద్ పవార్, సోదరుడు అజిత్ పవార్‌నే బీజేపీ ఎప్పుడు లక్ష్యంగా చేసుకుంటూ వార్తల్లో నిలుస్తుందని ఎద్దేవా చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన పార్టీ కార్యకర్తలతో సమావేశం అనంతరం సుప్రియా సూలే విలేకరులతో మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి సంబంధించి ఎలాంటి విజన్ కాషాయ పార్టీకి లేదని అన్నారు. ఎప్పుడు శరద్ పవార్, అజిత్ పవార్‌పైనే ధ్యాస పెట్టడం వల్ల దేశం, రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ రూపొందించే సమయం ఆ పార్టీకి లేదనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇదే పద్ధతి కొనసాగితే ద్రవ్యోల్బణాన్ని ఎలా తగ్గిస్తారు? ఉద్యోగాలను ఎలా సృష్టిస్తారని ఆమె ప్రశ్నించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్సీపీ మధ్య మాటలయుద్ధం క్రమంలో సుప్రియా సూలే వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆమె మాట్లాడుతూ 'ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకుగానీ మహిళల భద్రతకు చర్యలను తీసుకునేందుకుగానీ ఫడ్నవీస్‌కు సమయం లేదు. ప్రస్తుతానికి అనుచితమైన అంశాలనే మాట్లాడుతున్నారు. గతంలో జీవిస్తుంటారు. వ్యర్థ ప్రసంగాలతో కాలక్షేపం చేస్తుంటారు. ఇది దురదృష్టకరం. చూయింగ్ గమ్ ముందు రుచిగా ఉంటుందిగానీ నమిలేకొద్దీ చప్పబడుతుంది' అని ఫడ్నవీస్ తీరును విమర్శించారు. సుపరిపాలనను అందించడం మినహా షిండే ప్రభుత్వం అంతా చేస్తోందని ఎద్దేవా చేశారు. శరద్ పవార్‌ను లక్ష్యంగా చేసుకుంటే తప్ప వార్తలు ఉండవని సుప్రియా సూలే వ్యాఖ్యానించారు.

భారతీయ విశ్వవిద్యాలయాలకు ప్రపంచ గుర్తింపు

ప్రధాని నరేంద్ర మోదీ

న్యూదిల్లీ: విద్యారంగంలో గత కొన్నేళ్లలో తీసుకున్న నిర్ణయాల వల్లే భారత విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును సాధించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. శుక్రవారం దిల్లీ యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాజాగా క్యూఎస్ గ్లోబల్ ర్యాంకింగ్సులో భారత యూనివర్సిటీలు సత్తా చాటాయని ప్రశంసించారు. ఈ జాబితాలో 2014లో 12 భారతీయ విద్యా సంస్థలుస్థ ఉంటే... ఇప్పుడు వాటి సంఖ్య 45కు చేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఐఐటీ, ఐఐఎమ్, ఎన్ఐటీ, ఎయిమ్స్ కళాశాలల సంఖ్య గణనీయంగా పెరిగిందన్న మోదీ... ఇవి నవభారతాన్ని నిర్మిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకానొక సమయంలో దిల్లీయూనివర్సిటీ పరిధిలో కేవలం మూడు కళాశాలలు మాత్రమే ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 90కు చేరుకుందన్నారు. ఒకప్పుడు మన దేశం బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఉండేదని, ఇప్పుడు ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థల్లో టాప్-5లో ఉందని తెలిపారు. అంతకుముందు విశ్వవిద్యాలయ ఆవరణలో టెక్నాలజీ ఫ్యాకల్టీ, కంప్యూటర్ సెంటర్, అకడమిక్ బ్లాక్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు, కాఫీ టేబుల్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పాల్గొన్నారు. ప్రధాని మాట్లాడుతూ... 'ఇటీవల నేను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు చూస్తే... మన దేశ ప్రతిష్ఠ అమాంతం పెరిగింది.

దానికి కారణం మన దేశంలో సత్తా ఉన్న యువతపై వారికున్న నమ్మకమే. ఈ పర్యటనలో ఇరుదేశాల మధ్య సెమీకండక్టర్లు, ఆర్టిఫీర్టిషియల్ ఇంటిలిజెన్స్ లాంటి రంగాల్లో కొన్ని కీలక ఒప్పందాలు జరిగాయి. ఇవి మన యువతకు ఎంతో మేలు చేస్తాయి. గూగుల్, మైక్రాన్ లాంటి పెద్ద సంస్థలు భారత్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి' అన్నారు. జీవితంలోని విభిన్న కోణాలకు దిల్లీ విశ్వవిద్యాలయం అందించిన సహకారాన్ని ప్రశంసించిన ప్రధాని, ఇది కేవలం విశ్వవిద్యాలయం మాత్రమే కాదని ఒక ఉద్యమమని అన్నారు.

మెట్రోలో మోదీ ప్రయాణం

అంతకుముందు దిల్లీ యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు హాజరయ్యేందుకు మెట్రో రైలులో మోదీ ప్రయాణించారు. సామాన్యుడిలా మెట్రోలో వెళ్లిన మోదీ... తోటి ప్రయాణికులతో సరదాగా మాట్లాడారు. దీనికి సంబంధించిన ఫొటోలను మోదీ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. వేడుకలకు హాజరైన అనంతరం కూడా మోదీ.. తిరిగి మెట్రోలోనే ప్రయాణించారు. మెట్రోలో ప్రయాణం సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. మరోవైపు మోదీ వస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు దిల్లీ యూనివర్సిటీ యాజమాన్యం మార్గదర్శకాలు జారీచేసింది. విద్యార్థులెవరూ నలుపు రంగు దుస్తులు ధరించి రావద్దని, అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించింది. ఉదయం 10-12 గంటల మధ్య తరగతులను రద్దు చేస్తున్నట్టు పేర్కొంది.

యూసీసీ ఎన్నికల గిమ్మిక్కు

శివపాల్ యాదవ్ విమర్శ

ఇటావా: లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసమే ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అంశాన్ని బీజేపీ తెరపైకి తీసుకొచ్చిందని సమాజ్‌వాదీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ సింగ్ యాదవ్ విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా...బీజేపీ ఇలాంటి ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకొస్తుందని, ప్రచారం తప్ప బీజేపీ చేయగలిగేదేమీ లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందే కమలదళం ఇలాంటి ప్రచారం చేస్తుందన్నారు. శివపాల్ సింగ్ యాదవ్ శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఇటీవల లేవనెత్తిన యూసీసీపై స్పందించారు. రెండు చట్టాలతో దేశాన్ని నడపటం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తూ...యూసీసీని తీసుకురావాల్సిన అవసరం ఉందని మోదీ మంగళవారం అన్నారు. ధరల పెరుగుదల, అవినీతి, నిరుద్యోగం వంటి అంశాలపై బీజేపీ ప్రభుత్వానికి ఎలాంటి ఆందోళన లేదని శివపాల్ విమర్శించారు. భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్‌పై దాడిని ప్రస్తావిస్తూ బీజేపీ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. పోలీసు స్టేషన్‌లలో, పోలీసు కస్టడీలో లేదా కోర్టుల్లో సైతం ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. పట్టపగలు బహిరంగంగానే హత్యలు జరుగుతున్నాయన్నారు. ఎలాంటి భయమూ లేకుండా నేరస్తులు యథేచ్ఛగా తిరుగుతున్నారని చెప్పారు.

ఆర్డినెన్స్‌పై ఆప్ ప్రచార పోరు

- 3న ప్రతుల దహనం
- 5న పార్లమెంటరీ నియోజకవర్గాల్లో
- 6-13 మధ్య దిల్లీ అంతటా
- ఆర్డినెన్స్‌పై సుప్రీంకు దిల్లీ ప్రభుత్వం

న్యూదిల్లీ: దిల్లీలో తన పెత్తనం సాగించుకోవడానికి ఆర్డినెన్స్ తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ పోరాటం కొనసాగిస్తోంది. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టింది. కాగా, ఆర్డినెన్స్‌పై ఆప్ ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించాలని ఆప్ అధినేత, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆయా పార్టీల అధినేతలు, ముఖ్యమంత్రులను కలిసి ఇప్పటికే విన్నవించారు. రాజ్యసభలో ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించాలని కోరారు. పోరాటంలో భాగంగా దిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జులై 3న ఆర్డినెన్స్ కాపీలు దహనం చేయాలని ఆప్ నిర్ణయించింది. సెంట్రల్ దిల్లీలోని పార్టీ ఆఫీసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ 3వ తేదీన ఆర్డినెన్స్ కాపీలు దహనం చేస్తారని ఆప్ శుక్రవారం తెలిపింది. ఆప్ ముఖ్య అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ రాజధానిలోని మొత్తం నియోజకవర్గాల్లో ఆర్డినెన్స్ కాపీలు దహనం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కేజ్రీవాల్, కేబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొంటారని వివరించారు. జులై 5న రాజధానిలోని మొత్తం ఏడు పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆర్డినెన్స్ కాపీలు తగులబెడతామని, జులై 6-13 మధ్య దిల్లీలోని అన్ని పట్టణాలు, గ్రామాలు, వార్డుల్లో ఆర్డినెన్స్ కాపీలు దహనం చేయనున్నట్లు తెలిపారు. బ్లాక్ ఆర్డినెన్స్ ద్వారా అక్రమంగా, చట్టవిరుద్ధంగా దిల్లీని తన గుప్పెట్లో పెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి కూడా అయిన భరద్వాజ విమర్శించారు. ఆప్‌కు సంబంధించిన ఏడుగురు ఉపాధ్యక్షులు దిలీప్ పాండే, జర్నయిల్ సింగ్, గులాబ్ సింగ్, జితేందర్ తోమర్, రితురాజ్ ఝా, రాజేశ్ గుప్తా, కుల్దీప్ కుమార్ సమయంలో తమ కార్యాచరణను భరద్వాజ్ ప్రకటించారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జూన్ 11న ఆప్ మహార్యాలీ నిర్వహించింది.

ఎల్‌జీ క్షమాపణ చెప్పాలి: ఆప్

ఉచితాలపై లెఫ్టినెంట్ గవర్నరు వినయ్ కుమార్ సక్సేనా వ్యాఖ్యలను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. తక్షణమే క్షమాపణ చెప్పాలని వీకే సక్సేనాను డిమాండ్ చేసింది. ఆప్ ముఖ్య అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో అనుభవిస్తున్న సదుపాయాలన్నింటినీ వదులుకోవాలని సక్సేనాను డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలపై రెండు రోజుల క్రితం లెఫ్టినెంట్ గవర్నరు అనుచితంగా మాట్లాడారు. ఆప్ ప్రభుత్వ ఉచితాలతో ప్రజలను సోమరులను చేస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఎల్‌జీ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని...ప్రజలకు క్షమాపణ చెప్పాలని ప్రియాంక డిమాండ్ చేశారు. దిల్లీ ప్రజలను ఎల్‌జీ అవమానించారని, దిల్లీలో పెద్దఎత్తున పన్నులు వసూలవుతాయని ఆయనకు తెలుసని, గత ఆర్థిక సంవత్సరంలో దిల్లీ వాసుల నుంచి రూ.1.75 లక్షల కోట్లు వసూలు చేశామని ఆమె వివరించారు. దిల్లీలో నిజాయతీగల ప్రభుత్వం ఉండటం కేంద్రానికి నచ్చడం లేదన్నారు. వీకే సక్సేనా 3 వేల నుంచి 4 వేల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్నారని, రాజ్ నివాస్‌లో ఉచితంగా నివాసముంటున్నారని, ఆయన ప్రయాణ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోందని ప్రియాంక వివరించారు. ఈ సొమ్మంతా దిల్లీ పన్ను చెల్లింపుదారులదేనని చెప్పారు. ప్రజలకు ఉచిత సదుపాయాలు కల్పించడం లెఫ్టినెంట్ గవర్నరుకు సమస్యగా ఉంటే...ముందుగా తాను అనుభవిస్తున్న ఉచిత సదుపాయాలన్నింటినీ వదులుకోవాలని ప్రియాంక డిమాండ్ చేశారు. గతంలో చాలా కీలకమైన కార్యక్రమాలను ఎల్‌జీ ఆపారని విమర్శించారు. రాజధాని ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని మండిపడ్డారు.

కేజ్రీవాల్ వర్సెస్ ఎల్‌జీ

పెండింగ్‌లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఫైలు

ప్రభుత్వానికి పంపామన్న సక్సేనా కార్యాలయం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నరు మధ్య కుమ్ములాట ఆగేలా కనిపించడం లేదు. ఏ ఒక్క విషయంలోనూ కేజ్రీవాల్ ప్రభుత్వానికి లెఫ్టినెంట్ గవర్నరు వీకే సక్సేనా సహకరించడం లేదు. ప్రభుత్వం పంపే ప్రతి ఫైలును తొక్కి పెడుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నారు. తాజాగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ప్రతిపాదనను వీకే సక్సేనాకు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పంపారు. దీనికి ఎల్‌జీ ఇప్పటి వరకు ఆమోదం తెలపలేదని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. అయితే, రాజ్‌నివాస్ వర్గాలు మాత్రం ఈ ఆరోపణలను ఖండించాయి. మరోవైపు, కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ప్రతిపాదనకు ఎల్‌జీ ఆమోదం తెలిపితే...మంత్రి అతిషికి అదనంగా ఆర్థిక, ప్రణాళిక, రెవెన్యూ శాఖల బాధ్యతలు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ఫైలు ఎల్‌జీ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వ అధికారులు చెప్పారు. ఈ ఆరోపణలను ఎల్‌జీ కార్యాలయం తోసిపుచ్చింది. మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ రాజీనామాతో అతిషి, సౌరభ్ భరద్వాజ్‌లను మార్చిలో కేజ్రీవాల్ కేబినెట్‌లోకి తీసుకున్నారు. విద్యుత్, విద్య, కళలు-సంస్కృతి-భాష, పర్యాటకం, ఉన్నత విద్య, శిక్షణ, సాంకేతిక విద్య, ప్రజాసంబంధాల శాఖలను అతిషి నిర్వహిస్తున్నారు. తాజాగా మరో మూడు శాఖలు అతిషి ఖాతాలో పడనుండటంతో మొత్తం శాఖలు 12కి పెరగనున్నాయి. అతిషి కేబినెట్ సహచరుడు కైలాశ్ గెహ్లాత్ ప్రస్తుతం రెవెన్యూ, ప్రణాళిక, ఆర్థికశాఖలు చూస్తున్నారు. సిసోదియా రాజీనామాత ప్రణాళిక, ఆర్థికశాఖలను కైలాశ్‌కు అప్పగించారు.

కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ఫైలుపై ఎల్‌జీ సంతకం చేయలేదని ఆప్ ప్రభుత్వం ఆరోపించింది. సంతకం కోసం ఆ ఫైలు నాలుగు రోజులుగా ఎల్‌జీ వద్దే ఉందని ఓ అధికారి చెప్పారు. నాలుగు రోజులైనా ఫైలుపై సంతకం చేయలేదని, గత ఎల్‌జీ అనిల్ బైజ్వాల్ మాత్రం ఫైలుపై సంతకం చేయడానికి అర గంట కూడా సమయం తీసుకునే వారు కాదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ఎల్‌జీ కార్యాలయం తోసిపుచ్చుతూ బుధవారమే ఫైలుపై సంతకం చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపింది. ఇదంతా తప్పుడు ప్రచారమని, ఇప్పటికీ ఫైలు ఎల్‌జీ కార్యాలయంలోనే ఉందని ఆప్ వర్గాలు స్పష్టంచేశాయి.

ఉత్తరాఖండ్ యూసీసీ ముసాయిదా సిద్ధం: జస్టిస్ దేశాయ్

న్యూదిల్లీ: ఉత్తరాఖండ్ కోసం ప్రతిపాదించిన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ముసాయిదా సిద్ధమైందని, త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని రిటైర్డ్ జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ అన్నారు. ఆమె శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ వర్గాల అభిప్రాయాలను, చట్టాలు, శాసనాలు, కొన్ని దేశాల్లో వాడుకలో ఉన్న సంబంధిత నియమాలను పరిగణనలోకి తీసుకొని తాజా ముసాయిదాను రూపొందించినట్లు చెప్పారు. ఉత్తరాఖండ్ కోసం ప్రతిపాదించిన ఉమ్మడి పౌరస్మృతి ముసాయిదా పూర్తి అయినట్లు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే దీనిని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని దేశాయ్ చెప్పారు. కాగా, గతేడాది ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యూసీసీ నిపుణుల కమిటీకి దేశాయ్ అధ్వర్యంలో పనిచేస్తోంది.

పశువుల దొంగతనం అనుమానంతో దారుణం

అగర్తల: పశువులు దొంగతనం చేస్తున్నాడన్న అనుమానంతో 41 ఏళ్ల నందు సర్కార్ అనే వ్యక్తిని గ్రామస్తులు దారుణంగా కొట్టి చంపారు. ఈ విషాదకర ఘటన పశ్చిమ త్రిపుర జిల్లాలో గురువారం జరిగింది. ఈ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పశువులు దొంగతనం ఆరోపణపై ఈస్టు చంద్రపూర్ గ్రామానికి చెందిన నందు సర్కార్‌ను గ్రామస్తులు గురువారం ఉదయం నిర్బంధించారని, కరెంటు స్తంభానికి కట్టేసి తీవ్రంగా కొట్టారని ఈస్టు అగర్తల పోలీసు స్టేషన్ ఆఫీసర్ ఇన్‌చార్జి రాణా చటర్జీ శుక్రవారం పీటీఐకి చెప్పారు. సమాచారం అందడంలో పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లారని, చావుబతుకుల మధ్య ఉన్న నందు సర్కార్‌ను ఆసుపత్రికి తరలించారని, నందు అక్కడ మరణించినట్లు రాణా చటర్జీ వివరించారు. తన భర్తను గ్రామస్తులు కరెంటు స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టి చంపారని నందు భార్య సోనాలీ సర్కార్ చెప్పింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఐపీఎస్‌పై రూ.10 లక్షల లంచం కేసు

చండీగఢ్: డ్రగ్ సరఫరాదారుడిని రక్షించేందుకు రూ.10 లక్షల లంచం తీసుకున్నాడన్న ఆరోపణపై సీనియర్ ఐపీఎస్ అధికారి ఇందర్‌బీర్ సింగ్‌పై పంజాబ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు గతేడాది జరిగింది. అయితే తాజాగా ఐపీఎస్ అధికారి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు విజిలెన్స్ బ్యూరో ఎస్పీ వరీందర్‌సింగ్ శుక్రవారం తెలిపారు. ప్రాథమికంగా గతేడాది జూన్ 30న నమోదైన ఈ కేసులో డీఐజీ ఇందర్‌బీర్ సింగ్ పేరును చేర్చినట్లు వరీందర్‌సింగ్ వివరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం, అవినీతి నిరోధక చట్టంలోని అనేక సెక్షన్‌లను డీఐజీపై మోపారు. 900 గ్రాముల మత్తుమందుతో సూర్జిత్‌సింగ్‌ను తరణ్ తరణ్ జిల్లాలోని ఖేకివిండ్ పోలీసు స్టేషన్ సిబ్బంది అరెస్టుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

చిరుత దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

మంగళూరు: చిరుతపులి దాడిలో 48 ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన నిట్టూరు చెక్‌పోస్టు సమీపంలో జరిగింది. దాడికి గురైన వ్యక్తిని గణేష్‌గా గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు కుక్క అరుపులు విని నిద్ర లేచి ఇంటి తలుపులు తెరిచి చూడగా... చిరుత ఒక్కసారిగా అతనిపైకి దూసుకెళ్లింది. కుటుంబ సభ్యుల అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు పరిగెత్తుకుంటూ గణేష్ ఇంటి దగ్గరకు రావడంతో చిరుత పారిపోయింది. తీవ్రంగా గాయపడిన గణేష్‌ను అంబులెన్స్‌లో ఉడిపి జిల్లా కుందాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పంజాబ్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ దేవిందర్‌సింగ్ మృతి

చండీగఢ్: పంజాబ్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ బీర్ దేవిందర్ సింగ్ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 73 ఏళ్ల సింగ్... ఇక్కడి 'పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' ఆస్పత్రిలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. దేవిందర్ సింగ్ 1980లో కాంగ్రెస్ టికెట్‌పై సిర్హింద్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2002లో ఖరార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పంజాబ్‌లో అమరీందర్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో 2003-2004 మధ్య పంజాబ్ అసెంబ్లీకి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. 2016లో సింగ్ కాంగ్రెస్ నుంచి బహిష్కరించబడ్డారు. 2019లో శిరోమణి అకాలీదళ్ (తక్సాలి)లో చేరారు. దేవిందర్ సింగ్ మృతికి పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ తదితరులు సంతాపం తెలిపారు.

జూన్‌లో తగ్గిన వర్షపాతం

కేరళ, బీహార్‌లో అత్యంత తక్కువగా వర్షాలు

రాజస్థాన్, పంజాబ్, హరియాణాలో అధికం

రుతుపవనాల మందగమనం

న్యూదిల్లీ: దేశంలో నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమవడంతో వానలు ముఖం చాటేశాయి. ఈ ఏడాది జూన్‌లో దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదైంది. వర్షాకాల సీజన్ మొదటి నెల జూన్‌లో ధాన్యాగార రాష్ట్రాలైన పంజాబ్, హరియాణ, రాజస్థాన్ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసినప్పటికీ అనేక దక్షిణాది రాష్ట్రాలు, బీహార్‌లో నైరుతి రుతుపవనాలు మందగమనంగానే ఉన్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డేటా ప్రకారం... జూన్ 29 నాటికి దేశంలో 136.5 మిల్లీమీటర్ల వర్షపాతం (సాధారణ వర్షపాతం 157.7 మిల్లీమీటర్లు) నమోదైంది. బీహార్, కేరళలో జూన్‌లో చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ రెండు రాష్ట్రాల్లో వరుసగా 69 శాతం, 60 శాతం లోటు వర్షపాతం నమోదైంది. బీహార్‌లో జూన్‌లో సాధారణం 151.1 మిల్లీమీటర్లు కాగా కేవలం 47.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కేరళలో 621.9 మిల్లీమీటర్లకు గాను 251.1 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈశాన్య రుతుపవనాల ద్వారా వర్షాలు కురిసే తమిళనాడులో జూన్‌లో సాధారణం 51.5 మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను 49.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈసారి నైరుతి రుతుపవనాలు జూన్ 8న కేరళలో ప్రవేశించాయి. అదే సమయంలో అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపర్జోయ్ తుపాను కారణంగా రుతుపవనాల రాక ఆలస్యమైంది. జూన్ 15న గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాలలో బిపర్జోయ్ తీరాన్ని తాకిన తర్వాత రుతుపవనాలు వేగంగా పురోగమించాయి.

వచ్చేవారం ఊపందుకోనున్న వర్షాలు

వాతావరణ కార్యాలయం గురువారం సాయంత్రం విడుదల చేసిన నివేదిక ప్రకారం... రాబోయే రెండు రోజుల్లో దేశంలోని మిగిలిన ప్రాంతాలకు రుతుపవనాలు పురోగమించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. వచ్చే వారం దేశంలో వర్షాలు ఊపందుకుంటాయని, అదే సమయంలో వాయువ్య భారతదేశం, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలలో వర్షాలు తగ్గుతాయని అంచనా. రాజస్తాన్, దిల్లీలో జూన్‌లో సాధారణ వర్షపాతం కంటే రెట్టింపు వర్షపాతం నమోదైంది.

నిరుద్యోగ సమస్యపై పోరాటం

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు: నిరుద్యోగ సమ స్యపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపటానికి పోరుబాట పట్టాలని యువతకు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో రాష్ట్రసమితి సమావేశం శుక్రవారం జరిగింది. సమావే శానికి తిరుమలై రామన్‌తో పాటు జాతీయ నాయకులు హరీశ్ బాల, జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర మాజీ నాయకులు జంగాల అజయ్ కుమార్, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తిరుమలై మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి యువతకు ఉద్యోగాలు కరువయ్యాయని విమర్శించారు. నిరుద్యోగం పెరగడం వలన యువత నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నదని చెప్పారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో నిరుద్యోగ శాతం 18.7గా నమోదైనట్లు లెక్కలు తెలుపుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను వాగ్దానాలతో మోసం చేస్తున్నాయన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన బీజేపీ...ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. యేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానన్న హామీని ముఖ్యమంత్రి జగన్ అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో నిరుద్యోగులను మళ్లీ ఓట్ల కోసం మోసం చేసే ప్రక్రియ ప్రారంభమైందని, రాష్ట్రంలో అన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటనలు ఇస్తున్నారని, యువత ఈ ప్రకటనలు చూసి మోసపోవద్దని హితవు పలికారు. యువతకు ఉద్యోగాలు కల్పించి అభివృద్ధిలో భాగ స్వామ్యం చేస్తే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుం దన్నారు. ప్రభుత్వాలు యువతకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోతే ఏఐవైఎఫ్ నాయ కత్వంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. యువత చెడుమార్గం పట్టకుండా దేశాభివృద్ధిలో పాలుపంచు కోవడానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న ఉద్యమానికి ప్రభుత్వాలు కనీస మద్దతు ప్రకటించలేదని మండిపడ్డారు. రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనం ముగింపు సందర్భంగా ఆహ్వానసంఘం అధ్యక్షుడు జంగాల అజయ్ కుమార్, కోట మాల్యాద్రి, ఆర్.తిరుమలై, హరీశ్ బాలలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, కార్యవర్గసభ్యులు జి.సంతోశ్ కుమార్, ఎం.యుగంధర్, నాగరాముడు, కారుమంచి, గంగా సురేశ్, కత్తి రవి, షేక్ సుభానీ, సుబ్బారావుతో పాటు 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల, దోనేపూడికి కృతజ్ఞతలు

ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి యువజన విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం ముగింపు సందర్భంగా నిర్వహించిన ప్రదర్శన నేపథ్యంలో యువతకు అవసరమైన టీషర్టుల కోసం వైఎఫ్ రాష్ట్ర సమితి కోరిన వెంటనే లక్ష సహాయం చేసిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రూ.75 వేల సహాయం చేసిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్‌కు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి తరపున పరుచూరి రాజేంద్ర, ఎస్.లెనిన్‌బాబు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు

సీఆర్ ఫౌండేషన్‌లో కళాక్షేత్రం ప్రారంభం

విశాలాంధ్ర-కొండాపూర్: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత అమరజీవి చంద్ర రాజేశ్వరరావు విశేషంగా కృషి చేశారనీ, ఆయన ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. కొండా పూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సీఆర్ కళాక్షేత్రం, దాసరి వాకింగ్ ట్రాక్‌లను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నిర్మాత అల్లు అరవింద్, సీఆర్ ఫౌండేషన్ మాజీ అధ్యక్షుడు సురవరం సుధాకరరెడ్డి, అగస్త్య అగ్రో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లంపాటి మురళి, సీఎస్ఐఆర్ రిటైర్డ్ సైంటిస్ట్ మల్లంపాటి వెంకటేశ్వరరావు, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కె. నారాయణ, ప్రధానకార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. అనంతరం అల్లు అరవింద్, సురవరం మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు అందించిన సేవలను కొనియాడారు. నారాయణ మాట్లాడుతూ సీఆర్ ఫౌండేషన్‌లో నివసిస్తున్న వారు సౌకర్యవంతగా వాకింగ్ చేసుకొవడానికి చక్కని వాకింగ్ ట్రాకింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీఆర్ కళాక్షేత్రను సైతం ఏర్పాటు చేశామని దాని ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. సీఆర్ ఫౌండేషన్‌లో నివసించే వారికి చక్కని భోజన సదుపాయాలతో పాటు వారి ఆరోగ్య స్థితి గతులను చూస్తున్నామని తెలిపారు. సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు కొచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి అన్ని రంగాలలో ముందుకు దూసుకెళ్లేలా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవ రావు, సంధ్యా కుమారి, డా.రజని, చెన్నమనేని వెంకటేశ్వరరావు,కృష్ణకుమారి, తుకారం, సరస్వతి, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తులసీచందుకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్): మతతత్వ శక్తుల నుంచి స్వతంత్ర జర్నలిస్టు తులసీచందుకు రక్షణ కల్పించాలని కవులు, రచయితలు, జర్నలిస్టులు డిమాండ్ చేశారు. తులసీచందుకు సంఘీభావం తెలుపుతూ శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్ లో బహుజన రచయితల వేదిక, అభ్యుదయ రచయితల సంఘం, విరసం, కవులు, రచయితలు, జర్నలిస్ట్ సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. సభకు సాహిత్య విమర్శకులు జి.లక్ష్మీనర్సయ్య అధ్యక్షత వహించగా ప్రముఖ కథారచయిత చల్లపల్లి స్వరూపరాణి, పాత్రికేయులు అనిల్ డ్యానీ, శాంతిశ్రీ, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిఖాఆకాష్, మోతుకూరి అరుణ కుమార్, విరసం రాష్ట్ర కార్యదర్శి అరసవిల్లి కృష్ణ తదితరులు మాట్లాడారు. చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ... గతంలో కొన్ని ప్రముఖ దినపత్రికల్లో జర్నలిస్ట్‌గా పని చేసిన తులసీచందు... సామాజిక మార్పు కోసం తన బాధ్యతను అంతటితో ఆపకుండా యు ట్యూబ్ చానల్, ఫేస్ బుక్ ద్వారా తన అభిప్రాయాలు చెబుతూ లక్షల మంది అభిమానాన్ని చూరగొన్నారన్నారు. మూఢ విశ్వాసాలు, పాలకుల ఫాసిస్టు విధానాలపై సామాజిక మాధ్యమాల ద్వారా తన గళం విప్పితే తట్టుకోలేని సంఘ్‌పరివార్, మతోన్మాద శక్తులు... అసభ్య సందేశాలతో దాడులు చేస్తామంటూ ఆమెపై బెదిరింపులకు పాల్పడటం బాధాకరం అన్నారు. మరో గౌరీ లంకేశ్ ఘటన జరగకుండా కాపాడుకునే బాధ్యత ప్రగతిశీల శక్తులు మేధావులు, జర్నలిస్టుల మీద ఉందని అన్నారు. సభకు ప్రముఖ రచయిత తంగిరాల సోనీ స్వాగతం పలకగా ప్రముఖ రచయితలు సరికొండ నరసింహ రాజు, వైష్ణవి, విజయరావు, మందరపు హైమవతి, దివికుమార్, షరీఫ్‌లు భావ ప్రకటన స్వేచ్ఛపై దాడులను ఖండిస్తూ కవితా గోష్ఠిలో పాల్గొన్నారు.

బాధితుల వేదన కలచి వేసింది

గవర్నర్‌ను కలిసిన రాహుల్ గాంధీ

ఇంఫాల్: ఏ సమస్యకు హింస పరిష్కారం కాబోదని, మణిపూర్‌లో శాంతి స్థాపన అత్యవసరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నొక్కి చెప్పారు. ఇంఫాల్, చురచాంద్పూర్, మెయిరంగ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న వారిని పరామర్శించారు. మణిపూర్ ప్రజల వేదన కలచివేసిందని, మణిపూర్ ప్రజల బాధ దేశ ప్రజల బాధన్నారు. రాహుల్ శుక్రవారం మణిపూర్ గవర్నర్ అనసూయ ఉయికెతో భేటీ అయి మణిపూర్ పరిణామాలను ప్రస్తావిస్తూ ఇది రాష్ట్రానికే కాదు దేశానికీ బాధాకరమేనని చెప్పారు. గవర్నర్‌తో భేటీ అనంతరం రాజ్‌భవన్ వద్ద విలేకరులతో రాహుల్ మాట్లాడుతూ 'శాంతి పథంలో ముందుకెళ్లాలేగానీ హింస ఏ సమస్యకు పరిష్కారం కాబోదు. మణిపూర్ ప్రజలు ఎదుర్కొన్నది చాలా భాయనకరం. రాష్ట్రంలో శాంతి స్థాపనే లక్ష్యం. అందుకే వచ్చా. మణిపూర్ ప్రజల బాధను అర్థం చేసుకోగలను. వాళ్ల అనుభవించిన వ్యథ వర్ణనాతీతం. ఇది దేశ ప్రజలను కలచివేస్తుంది' అని అన్నారు. మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనేక శిబిరాలను సందర్శించానని, అక్కడ మౌలిక వసతులను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పదలిచానని రాహుల్ అన్నారు. శిబిరాల్లో ఆహారం మెరుగ్గా ఉండాలని, మందులు సరఫరా చేయాలని కోరారు. వసతుల లేమి గురించి శిబిరాల్లో ఉన్న వారి నుంచి అనేక ఫిర్యాదులు ఉన్నట్లు చెప్పారు. మణిపూర్‌లో హింస కారణంగా ఆత్మీయులను, ఆస్తులను కోల్పోయిన వారి వేదన హృదయ విదారకమన్నారు. ప్రతి ఒక్కరి చూపు సాయాన్ని అర్థిస్తున్నట్లుగా ఉందన్నారు. ప్రజల జీవితాలు, జీవనోపాధికి భద్రత కల్పించడం అత్యవసరమని, అందుకోసం అందరి ఏకంగా ప్రయత్నించాలని రాహుల్ అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.